www.hamsakalam.com
సంచలన తెలుగు దినపత్రిక
PRGI: TGTEL/26/A3129
# హంస కలం వార్త
HAMSA KALAM VARTA
చీఫ్ ఎడిటర్: వడ్ల మధుసూదన్ చారి



EDITOR :VADLA MADHUSUDHAN CHARY MEDCHAL /MALKAJGIRI VOLUME:1 ISSUE:83 FRIDAY , AUGUST 07, 2026 PAGES:8 COST: 4 /-

ఎడిటర్ : వడ్ల మధుసూదన చారి మేడ్చల్ /మల్కాజిగిరి సంపుటి : 1 సంచిక : 83 శుక్రవారం 07 ఆగస్టు 2026 పేజీలు :8 వెల: 4/-




## నైనీ గని నుంచి ఎస్‌టీపీపీకి చేరిన తొలి బొగ్గు రైలు..

**హంసకాలం వార్త :** మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్రాజెక్ట్ కి ఒడిశాలోని నైనీ బ్లాక్ నుంచి బొగ్గు రావడం పట్ల తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హర్షం వ్యక్తం చేశారు. ఇది చారిత్రాత్మక ఘట్టమని అభివర్ణించారు. గురువారం ఈ థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌కు నైనీ బ్లాక్ నుంచి బొగ్గు లోడ్‌తో రైల్వే వ్యాగన్ వచ్చింది. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పందించారు. రాష్ట్రంలో విద్యుత్ లోటు లేకుండా చర్యలు తీసుకుం టున్నామని పేర్కొన్నారు. సింగరేణి థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌కు తమ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. దేశ అవసరా లకూ సింగరేణి బొగ్గు కీలకమని మిగతా2లో

# తెలంగాణలో కొత్త రేషన్ కార్డులు






### ఆగస్టు 15న రేవంత్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ

సంగారెడ్డిలో లాంఛనంగా ప్రారంభించనున్న ముఖ్యమంత్రి
అన్ని నియోజకవర్గాల్లో ఏకకాలంలో పంపిణీ కార్యక్రమం
డెబిట్ కార్డు సైజులో బార్‌కోడ్‌తో రానున్న కొత్త కార్డులు

**హంసకాలం వార్త :** తెలంగాణ రాష్ట్రంలోని అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఆగస్టు 15న కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించనుంది. సంగారెడ్డి వేదికగా జరగనున్న రాష్ట్రస్థాయి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పంపిణీని లాంఛనంగా ప్రారంభించ నున్నారు. ఈ కార్యక్రమం వివరాలను నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను ముఖ్యమంత్రి ఇప్పటికే ఆమోదించారని ఆయన తెలిపారు.ఆగస్టు 15న మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల మధ్య రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మిగతా2లో

## నకిలీ ఫైర్ ఎన్‌ఓసీల అంశం..



### మరో 176 కాలేజీలపై విచారణ

**హంసకాలం వార్త :** ఇంటర్ కాలేజీల నకిలీ ఫైర్ ఎన్‌ఓసీల వ్యవహారంలో పోలీసుల విచారణ కొనసాగుతోంది. మరో 48 కాలేజీల చిట్టాను హైడ్రా అధికారులు పోలీసులకు అందజేశారు. మిగతా2లో

## పెట్టుబడుల పేరుతో మోసం..

### బీఆర్ఎస్ నేత అరెస్ట్




మణికొండ బీఆర్ఎస్ నేత రూపారెడ్డిని పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. ఓ టీవీ చానెల్‌లో లైవ్ నుంచి బయటకు వస్తుండగా మాదాపూర్‌లో నార్సింగి పోలీసులు అరెస్ట్ చేశారు. 2

## రాహుల్ గాంధీకి కేంద్ర మంత్రి ఫోన్

### డీలిమిటేషన్ బిల్లుకు మద్దతివ్వాలని విన్నపం



- రాహుల్ గాంధీకి ఫోన్ చేసిన కిరణ్ రిజిజు
- డీలిమిటేషన్ బిల్లుకు మద్దతు కోరిన కేంద్రం
- మహిళా రిజర్వేషన్ల అమలు కోసమే ప్రయత్నమన్న రిజిజు
- మిత్రపక్షాలతో చర్చించి నిర్ణయం చెబుతానన్న రాహుల్
- కాంగ్రెస్ వైఖరిలో మార్పు లేదన్న వేణుగోపాల్

వివరాలు 2లో..

## జీసీసీలకు తెలంగాణే బెస్ట్ డెస్టినేషన్



**హంసకాలం వార్త :** తెలంగాణకు 150 కొత్త జీసీసీలు 20 నెలల్లో రానున్నాయని రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వ్యాఖ్యానించారు. జీసీసీలతో 1.5 లక్షల ఉద్యోగాలు కల్పిస్తున్నట్లు ప్రకటించారు. గురువారం జేఎల్‌ఎల్ గ్లోబల్ కెపబిలిటీ సెంటర్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. హైదరాబాద్‌ను జీసీసీ హబ్‌గా జేఎల్‌ఎల్ ఎంచుకుందని వెల్లడించారు. జీసీసీలకు తెలంగాణే బెస్ట్ డెస్టినేషన్ అని వివరించారు. మిగతా2లో



## అమెరికా రాయబారితో సీఎం రేవంత్ రెడ్డి కీలక భేటీ

వీసా నిబంధనలపై సీఎం రేవంత్ విజ్ఞప్తి.. సానుకూలంగా స్పందించిన అమెరికా
H-1బీ వీసా నిబంధనలు సరళం చేయాలని వినతి
తెలంగాణ విద్యార్థులకు వీసా స్లాట్లు పెంచాలన్న సీఎం
రాష్ట్రంలో పెట్టుబడులకు అమెరికా కంపెనీలకు ఆహ్వానం
సీఎం విజ్ఞప్తులపై సానుకూలంగా స్పందించిన అమెరికా రాయబారి

2

## కేటీఆర్ ను కలిసిన ప్రకాష్ అంబేద్కర్



-కేటీఆర్ నివాసానికి వచ్చిన ప్రకాష్ అంబేద్కర్ -ప్రకాష్ అంబేద్కర్ ను ఘనంగా సత్కరించిన కేటీఆర్ -పలు రాజకీయ, సామాజిక అంశాలపై చర్చించిన నేతలు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో వంచిత్ బహుజన్ అగాడీ అధినేత, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మనవడు ప్రకాష్ అంబేద్కర్ హైదరాబాద్‌లో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. 2

## క్షుద్ర పూజల విషయంలో హరీశ్‌రావు వివరణ ఇవ్వాలి




### హరీశ్‌రావుపై తప్పుడు ప్రచారం చేయలేదు..
### నాకు, సీఎంకి మధ్య ఎలాంటి గ్యాప్ లేదు
### అరవింద్, సంజయ్ చిన్నపిల్లలు..

**హంసకాలం వార్త :** మాజీమంత్రి హరీశ్‌రావు పై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. క్షుద్ర పూజల విషయంలో ఆయన వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. హరీశ్‌రావు వెళ్లిన గుడులు క్షుద్ర పూజలకు ఫేమస్ అని చెప్పుకొచ్చారు. ఆయన ఎందుకు అక్కడ పూజలు చేశారో చెప్పాలని ప్రశ్నించారు. గురువారం గాంధీభవన్‌లో మీడియాతో మహేశ్ గౌడ్ మాట్లాడారు. తాను ఆయనను కించపరచలేదని స్పష్టం చేశారు. లీగల్ నోటీసులకు తాము భయపడమని అన్నారు.హరీశ్‌రావుపై తప్పుడు మిగతా2లో

## రేవంత్ రెడ్డి ఒక్కసారి కూడా ‘జై తెలంగాణ’ అనలేదు



తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని వ్యక్తి ముఖ్యమంత్రిగా ఉన్నారన్న హరీశ్
కేసీఆర్ పోరాటం, జయశంకర్ సార్ ఆరాటం వల్లే తెలంగాణ వచ్చిందని వ్యాఖ్య
గోదావరి జలాల హక్కుల పరిరక్షణలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మండిపాటు

**హంసకాలం వార్త :** సిద్దిపేటలో ఆచార్య జయశంకర్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సిద్దిపేట ప్రాంతంతో మిగతా2లో

## ఈటల వర్సెస్ సంజయ్ పోరుకు ముగింపు

- తెలంగాణ బీజేపీలో ఈటల, బండి సంజయ్ మధ్య ఆధిపత్య పోరు
- రెండు వర్గాల పట్టుదల కారణంగా పెండింగ్‌లో పడిన 3 జిల్లాల అధ్యక్షుల నియామకాలు
- సుదీర్ఘ చర్చల అనంతరం కుదిరిన సయోధ్య

**హంసకాలం వార్త :** తెలంగాణ బీజేపీలో గత కొంతకాలంగా ఆధిపత్య పోరుతో తీవ్ర ఉత్కంఠ రేపిన మూడు జిల్లాల అధ్యక్షుల పీటముడి ఎట్టకేలకు వీడింది. 2లో



# తెలంగాణలో కొత్త రేషన్ కార్డులు..

ఈ కార్యక్రమం వివరాలను నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను ముఖ్యమంత్రి ఇప్పటికే ఆమోదించారని ఆయన తెలిపారు. ఆగస్టు 15న మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల మధ్య రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏకకాలంలో కార్డుల పంపిణీ ప్రక్రియ కొనసాగుతుంది. జిల్లా యంత్రాంగం, పౌర సరఫరాల శాఖల సమన్వయంతో రెవెన్యూ డివిజనల్ అధికారులు (ఆర్డీవోలు) ఈ పంపిణీని పర్యవేక్షిస్తారు. లబ్ధిదా రుల తుది జాబితాలను సిద్ధం చేసి, పంపిణీకి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. నూతనంగా రూపకల్పన చేసిన ఈ రేషన్ కార్డులు లామినేష న్‌తో డెబిట్ కార్డు తరహాలో సౌకర్యవంతంగా ఉంటాయి. ప్రస్తుతం అమల్లో ఉన్న కార్డుల్లా కాకుండా, వీటిపై కుటుంబ సభ్యుల ఫొటోలు, పేర్లకు బదులుగా ఒక విశిష్ట సంఖ్య, బార్‌కోడ్ మాత్రమే ఉంటాయి. ఈ బార్‌కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా లబ్ధిదారులకు సంబంధిం చిన పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో పొందవచ్చు. నూతనంగా అర్హత పొందిన కుటుంబాలకు సంపూర్ణ ఆహార భద్రత కల్పించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం.

# నైనీ గని నుంచి ఎస్‌టీపీపీకి చేరిన తొలి బొగ్గు రైలు..

ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పందించారు. రాష్ట్రంలో విద్యుత్ లోటు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. సింగరేణి థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌కు తమ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. దేశ అవసరాలకూ సింగరేణి బొగ్గు కీలకమని గుర్తు చేశారు. కొత్త కోల్ బ్లాకుల కోసం ప్రయత్నాలు కొనసాగుతాయని తెలిపారు. సింగరేణిని కాపాడుకుంటామని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. నైనీ గనుల నుంచి బొగ్గు రాకతో సింగరేణి థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌కు ఆ కొరత తీరిందని వివరించారు. సింగరేణి థర్మల్ పవర్ ప్రాజెక్ట్ కి రైలు వ్యాగిన్ చేరుకోగానే.. ఉన్నతాధి కారులు స్వాగతం పలికారు. 59 బాక్స్ వ్యాగన్లలో మొత్తం 4,000 టన్నుల జీ-10 రకం బొగ్గు ఒడిశాలోని నైనీ గని నుంచి గురువారం ఉదయం జైపూర్‌కు చేరుకుంది. సింగరేణి కాలరీస్ నుంచి 136 ఏళ్ల చరిత్రలో తొలిసారిగా రాష్ట్రం వెలుపల ఉన్న గని నుంచి బొగ్గు ఉత్పత్తిని సాధించి సొంత థర్మల్ ప్లాంట్‌కు రవాణా చేయడం ఇదే తొలిసారి.

# అమెరికా రాయబారితో సీఎం రేవంత్ రెడ్డి కీలక భేటీ

హెచ్-1బీ వీసా నిబంధనలను సులభతరం చేయాలని, అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే తెలంగాణ విద్యార్థుల కోసం వీసా స్లాట్ల సంఖ్యను పెంచాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అమెరికా ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం న్యూఢిల్లీలో అమెరికా రాయబారి సెర్గియో గోర్‌తో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణకు సంబంధించిన పలు కీలక అంశాలపై వారు సుదీర్ఘంగా చర్చించారు. ప్రతి ఏటా అమెరికాలో ఉన్నత విద్య కోసం వెళ్లే తెలంగాణ విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నందున, వారికి సకాలంలో వీసా అపాయింట్‌మెంట్లు లభించేలా దరఖాస్తు ప్రక్రియను వేగవంతం చేయాలని సీఎం విజ్ఞప్తి చేశారు. అక్కడ చదువుకుంటున్న విద్యార్థుల భద్రత, సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. అలాగే, హెచ్-1బీ నిబంధనల్లో ఏవైనా మార్పులు చేపట్టేటప్పుడు ఆ సమాచారాన్ని ముందుగా తెలియజేయాలని, తద్వారా అమెరికాలో పనిచేస్తున్న తెలంగాణ నిపుణుల ప్రయోజనాలను కాపాడవచ్చని ఆయన సూచించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అపార అవకాశాలను రేవంత్ రెడ్డి ఈ సమావేశంలో వివరించారు. ఐటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), లైఫ్ సైన్సెస్, ఫార్మా, స్టార్టప్‌ల వంటి రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు అమెరికా కంపెనీలను ఆయన ఆహ్వానించారు. హైదరాబాద్‌లో తమ అంతర్జాతీయ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా, అమెరికాలోని ప్రముఖ విశ్వవిద్యాలయాలు తెలంగాణలోని విద్యాసంస్థలతో కలిసి సంయుక్తంగా పరిశోధన, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేలా ప్రోత్సహించాలని విన్నవించారు. సుమారు అరగంటకు పైగా సాగిన ఈ సమావేశంలో ముఖ్యమంత్రి చేసిన విజ్ఞప్తులపై రాయబారి సెర్గియో గోర్ సానుకూలంగా స్పందించారు. అమెరికాలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న భారతీయ భాషల్లో తెలుగు ఒకటిగా ఉందని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి గుర్తుచేశారు.

# క్షుద్ర పూజల విషయంలో హరీశ్‌రావు వివరణ ఇవ్వాలి

**హరీశ్‌రావుపై తప్పుడు ప్రచారం చేయలేదు..**

తాను హరీశ్‌రావు గురించి అబద్ధాలు చెప్పలేదని మహేశ్ గౌడ్ అన్నారు. ఏమైనా ఉంటే న్యాయస్థానంలో కొట్లాడుతామని చెప్పుకొచ్చారు. తాను హరీశ్‌రావుపై తప్పుడు ప్రచారం చేయలేదని తేల్చిచెప్పారు. ఆయన ఎందుకు ఆ గుడులకు వెళ్లారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ రాష్ట్రానికి ఎవరు శనో, ఎవరు దరిద్రమో ప్రజలు ఎన్నికల్లో తేల్చారని తెలిపారు. తమకు మూఢనమ్మకాలు లేవని స్పష్టం చేశారు. కాంగ్రెస్ త్యాగాల గురించి తెలుసుకోవాలని అన్నారు. తమపై విమర్శలు చేయడానికి ప్రతిపక్షాలు అవకాశం ఉందని చెప్పారు.

**నాకు, సీఎంకి మధ్య ఎలాంటి గ్యాప్ లేదు**

తనకు, సీఎం రేవంత్‌రెడ్డికి మధ్య ఎలాంటి గ్యాప్ లేదని మహేశ్ కుమార్ గౌడ్ తేల్చిచెప్పారు. సీఎం, తాను రోజూ ఫోన్‌లో మాట్లాడుకుంటామని అన్నారు. నిన్న కూడా సీఎంతో ఫోన్‌లో మాట్లాడానని తెలిపారు. కో ఆర్డినేషన్ కమిటీకి అన్ని చెప్పాల్సిన అవసరం ముఖ్యమంత్రికి లేదన్నారు. తాము సీఎంని గౌరవిస్తామని స్పష్టం చేశారు. పార్టీ, ప్రభుత్వం వేర్వేరు కాదని.. రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ముఖ్యమంత్రి అని తెలిపారు.

**అరవింద్, సంజయ్ చిన్నపిల్లలు..**

తన ఆడియోలు, వీడియోలు ఉన్నాయని ప్రచారం చేస్తున్నారని.. దమ్ముంటే అవి బయట పెట్టాలని మహేశ్ కుమార్ గౌడ్ సవాల్ చేశారు. సీఎంకు, తనకు మంచి సఖ్యత ఉందని తెలిపారు. దొంగ చాటున ఫిర్యాదులు చేసుకునే అవకాశం కాంగ్రెస్‌లో లేదని స్పష్టం చేశారు. ఏమున్నా తాము ముఖంపైనే మాట్లాడుకుంటామని అన్నారు. బయట జరుగుతున్న విషయాలను కూడా తాము చర్చించుకుంటామని తెలిపారు. కో ఆర్డినేషన్ కమిటీలో కీలక అంశాలపై చర్చ జరిగిందని చెప్పారు. బీజేపీ ఎంపీ అరవింద్ మాటలు నీటి మూటలని ఎద్దేవా చేశారు. తన ముందు అరవింద్, సంజయ్ చిన్నపిల్లలని మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు.

# నకిలీ ఫైర్ ఎన్‌ఓసీల అంశం..

హైదరాబాద్, ఆగస్టు 6: ఇంటర్ కాలేజీల నకిలీ ఫైర్ ఎన్‌ఓసీల వ్యవహారంలో పోలీసుల విచారణ కొనసాగుతోంది. మరో 48 కాలేజీల చిట్టాను హైడ్రా అధికారులు పోలీసులకు అందజేశారు. విచారణలో భాగంగా ఒకే తరహాలో నకిలీ ఫైర్ ఎన్‌ఓసీలు తయారు చేసినట్లు గుర్తించారు. దాదాపు 56 కాలేజీలు నకిలీ ఎన్‌ఓసీలు సమర్పించినట్లు గుర్తించిన హైడ్రా.. మరో 176 కాలేజీలపై విచారణ జరుపుతోంది. ఐదు అంతస్తులలోపు ఉన్న భవనాల అనుమతుల కోసం ఫైర్ ఎన్‌ఓసీలను హైడ్రా ఇస్తుంది. ఆఫ్‌లైన్‌లో ఎన్‌ఓసీలు మంజూరు చేస్తున్న నేపథ్యంలో కాలేజీ యాజమాన్యాలు అక్రమాలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఎన్‌ఓసీల కోసం హైడ్రాకు దరఖాస్తు చేయకుండానే నకిలీలు సృష్టించి ఇంటర్ బోర్డుకు కాలేజీలు సమర్పించినట్లు విచారణలో వెల్లడైంది. ఒక్కొక్క యూనివర్సిటీకి రూ.6 లక్షల నుంచి రూ.10 లక్షలను కాలేజీ యాజమాన్యాలు ఖర్చుపెట్టినట్లు తెలుస్తోంది. ఎన్వోసీల కోసం జీహెచ్‌ఎంసీ, హైడ్రా, ఫైర్ మాజీ డీజీల సంతకాలను ఫోర్జరీ చేసినట్లు గుర్తించారు. ఆయా కళాశాలల యాజమాన్యాలను అదుపులోకి తీసుకుని పూర్తి స్థాయిలో విచారణ జరిపితే అసలు వాస్తవాలు బయటపడతాయని పోలీసులు భావిస్తున్నారు. హైడ్రా నివేదిక, పోలీసుల విచారణలో బయటపడ్డ అంశాలను ఆధారంగా చేసుకుని కాలేజీ యజమాన్యాలపై క్రిమినల్ చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం.

# పెట్టుబడుల పేరుతో మోసం..




మణికొండ బీఆర్‌ఎస్ నేత రూపారెడ్డిని పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. ఓ టీవీ చానెల్‌లో లైవ్ నుంచి బయటకు వస్తుండగా మాదాపూర్‌లో నార్సింగి పోలీసులు అరెస్ట్ చేశారు. పెట్టుబడుల పేరుతో రూపారెడ్డి మోసానికి పాల్పడిందని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆమెను అరెస్ట్ చేశారు. ఉదయం నార్సింగి పోలీస్ స్టేషన్ వద్ద భాదితులు ఆందోళన చేపట్టడంతో రూపారెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రూపారెడ్డి కూతురుని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ కొడుకు వివాహం చేసుకోనున్న విషయం తెలిసిందే. ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కి ఈ వివాహం చేసుకోవడం ఇష్టంలేక పోవడంతో తండ్రి కొడుకులు మధ్య వివాదం నెలకొన్నట్లు వార్తలు వచ్చాయి. బాధితుల వెనుక ప్రకాశ్‌గౌడ్ ఉండి నడిపిస్తున్నారని రూపారెడ్డి ఆరోపణలు చేశారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ప్రభుత్వంతో చర్చిస్తున్నాం

హైదరాబాద్, ఆగస్టు 06:



పదవుల భర్తీపై కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి సరిగా లేదని ఎమ్మెల్సీ కోదండరాం పెదవి విరిచారు. పదవుల భర్తీ ఆలస్యం చేయడం వల్ల కలిగే ప్రయోజనం లేదన్నారు. గురువారం హైదరాబాద్‌లో తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొ. జయశంకర్ సార్ జయంతి సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ.. విద్యార్థులు, నిరుద్యోగుల అంశంలో బీఆర్‌ఎస్ హయాంలో కంటే ఈ ప్రభుత్వంలో స్పందన బాగుందని రేవంత్ రెడ్డి సర్కారును ప్రశంసించారు. ప్రభుత్వంలో తమ భాగస్వామ్యంపై సంప్రదింపులు చేస్తున్నామని వివరించారు. మాకు ఎమ్మెల్సీ, కార్పోరేషన్ చైర్మన్లు ఇస్తామన్నారని గుర్తు చేశారు. గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో పోటీ అంశంపై చర్చిస్తున్నామని చెప్పారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశంపై ప్రభుత్వంతో చర్చిస్తున్నామని పేర్కొన్నారు. గత ప్రభుత్వ వైఖరితో ఈ ప్రభుత్వంపై ఆర్థిక భారం పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ జాతిపిత జయశంకర్ సర్ అని విద్యార్థులే ప్రకటించుకున్నారని ఎమ్మెల్సీ కోదండరాం వివరించారు.

## జీసీసీలకు తెలంగాణే బెస్ట్ డెస్టినేషన్

ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. హైదరాబాద్‌ను జీసీసీ హబ్‌గా జేఎల్‌ఎల్ ఎంచుకుందని వెల్లడించారు. జీసీసీలకు తెలంగాణే బెస్ట్ డెస్టినేషన్ అని వివరించారు. ఏఐ, డీప్‌టెక్ రంగాల్లో తెలంగాణ దూసుకుపోతోందని ఉద్ఘాటించారు. జాతీయ జీసీసీ లీజింగ్‌లో హైదరాబాద్ వాటా 16 శాతం ఉందని చెప్పుకొచ్చారు.దజీసీసీల విస్తరణలో వేగం పెరిగింది హైదరాబాద్ కార్యాలయ లీజింగ్‌లో జీసీసీల వాటా 42శాతమని మంత్రి తెలిపారు. హెల్త్‌కేర్, బయోటెక్, సెమీకండక్టర్లకు హైదరాబాద్ తొలి ఎంపిక అని వివరించారు. జేఎల్‌ఎల్ జీసీసీతో రెండేళ్లలో 1,600 ఉద్యోగాలు వస్తాయని చెప్పుకొచ్చారు. ప్రపంచ స్థాయి పెట్టుబడులకు తెలంగాణ ఆకర్షణ కేంద్రమని వెల్లడించారు. ఏఐ సిటీ, ఫ్యూచర్ సిటీతో పెట్టుబడులకు కొత్త ఊపు వస్తోందని తెలిపారు. నైపుణ్యాభివృద్ధితో యువతకు మరిన్ని ఉద్యోగావకాశాలు వస్తాయని అభిప్రాయపడ్డారు. తెలంగాణలో జీసీసీల విస్తరణలో వేగం పెరిగిందని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు.

## కేటీఆర్ ను కలిసిన ప్రకాష్ అంబేద్కర్

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో వంచిత్ బహుజన్ అగాడీ అధినేత, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మనవడు ప్రకాష్ అంబేద్కర్ హైదరాబాద్‌లో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. బంజారాహిల్స్‌లోని కేటీఆర్ నివాసంలో జరిగిన ఈ సమావేశంలో పలు రాజకీయ, సామాజిక అంశాలపై వీరిద్దరూ సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ మాజీ మంత్రులు జగదీశ్ రెడ్డి, నిరంజన్‌రెడ్డిలతో పాటు పలువురు మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నాయకులను ప్రకాష్ అంబేద్కర్‌కు కేటీఆర్ పరిచయం చేశారు. భేటీ అనంతరం ప్రకాష్ అంబేద్కర్‌ను కేటీఆర్ శాలువాతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికను బహూకరించారు.

## రేవంత్ రెడ్డి ఒక్కసారి కూడా 'జై తెలంగాణ' అనలేదు

సిద్దిపేట ప్రాంతంతో జయశంకర్ కు ప్రత్యేక అనుబంధం ఉండేదని గుర్తుచేసుకున్న ఆయన... కేసీఆర్ పోరాటం, జయశంకర్ సార్ ఆరాటం వల్లే తెలంగాణ కల సాకారమైందని వ్యాఖ్యానించారు. నాడు ఉద్యమంలో ఏనాడూ పాల్గొనని వ్యక్తి ఈరోజు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నారని... రేవంత్ ఒక్కసారి కూడా 'జై తెలంగాణ' అని అనలేదని విమర్శించారు. గోదావరి నదీ జలాల హక్కుల పరిరక్షణలో కాంగ్రెస్ సర్కార్ ఘోరంగా విఫలమైందని హరీశ్ రావు ఆరోపించారు. కేసీఆర్ హయాంలో 380 టీఎంసీల నీటిని హక్కుగా సాధిస్తే, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో ఒక్క ప్రాజెక్టుకూ అనుమతి తీసుకురాకపోగా సాధించుకున్న అనుమతులను కూడా రద్దు చేసేలా గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (GRMB) అజెండా రూపొందుతోందని మండిపడ్డారు. దేశ చరిత్రలోనే ఎక్కడా లేని విధంగా అనుమతులు వచ్చిన ప్రాజెక్టులను పునఃసమీక్షించి రద్దు చేయాలనే అంశం అజెండాలోకి రావడం దుర్మార్గమన్నారు. ఏపీ నిర్మిస్తున్న బనకచర్ల ప్రాజెక్టుతో పాటు సమ్మక్క-సారక్క ప్రాజెక్టు 47 టీఎంసీల క్లియరెన్స్ విషయంలో రేవంత్ ప్రభుత్వం ఏపీ సర్కార్‌తో లోపాయికారీ ఒప్పందం చేసుకుందని విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి జీఆర్‌ఎంబీ అజెండాను మార్పించాలని, లేని పక్షంలో ఆ సమావేశాన్ని తక్షణమే బహిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఈటల వర్సెస్ సంజయ్ పోరుకు ముగింపు..

తెలంగాణ బీజేపీలో గత కొంతకాలంగా ఆధిపత్య పోరుతో తీవ్ర ఉత్కంఠ రేపిన మూడు జిల్లాల అధ్యక్షుల పీటముడి ఎట్టకేలకు వీడింది. పార్టీ కీలక నేతలు ఈటల రాజేందర్, బండి సంజయ్ వర్గాల నడుమ పట్టుదల కారణంగా పెండింగ్‌లో పడిన కరీంనగర్, వికారాబాద్, మేడ్చల్ (అర్బన్) జిల్లాల అధ్యక్షుల స్థానాలను భర్తీ చేస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ఇరువర్గాల ముఖ్య నేతల మధ్య సుదీర్ఘంగా సాగిన చర్చల అనంతరం సయోధ్య కుదరడంతో... కరీంనగర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా సాయి మల్లేశం, వికారాబాద్ జిల్లా అధ్యక్షుడిగా యూ. రమేశ్, అలాగే మేడ్చల్ (అర్బన్) జిల్లా అధ్యక్షుడిగా గిరివర్ధన్ రెడ్డిలను ఎంపిక చేశారు. అన్ని వర్గాలకూ ఆమోదయోగ్యమైన అభ్యర్థులకే పగ్గాలు అప్పగిస్తూ రాష్ట్ర నాయకత్వం ఈ కీలక నిర్ణయం తీసుకోవడంతో బీజేపీ శ్రేణుల్లో జోష్ నెలకొంది.

## రాహుల్ గాంధీకి కేంద్ర మంత్రి ఫోన్..

మహిళా రిజర్వేషన్ల అమలుకు మార్గం సుగమం చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రతిపక్షాల మద్దతు కూడగట్టే ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు.. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి ఫోన్ చేసి నియోజకవర్గాల పునర్విభజన బిల్లుకు మద్దతు ఇవ్వాలని కోరినట్లు సమాచారం. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల సందర్భంగా ఈ అంశంపై రాహుల్ గాంధీతో రిజిజు మాట్లాడటం ఇది మూడోసారి అని తెలుస్తోంది. బిల్లుకు ప్రతిపక్షం సహకరిస్తే మహిళా రిజర్వేషన్ల అమలు వేగవంతమవుతుందని ఆయన వివరించినట్లు సమాచారం. లేదంటే మహిళల్లో అసంతృప్తి పెరిగే అవకాశం ఉందని కూడా రిజిజు చెప్పినట్లు తెలుస్తోంది. అయితే ఈ అంశంపై రాహుల్ గాంధీ ఎలాంటి స్పష్టమైన హామీ ఇవ్వలేదని సమాచారం. ముందుగా కాంగ్రెస్ మిత్రపక్షాలు, ఇండియా కూటమి భాగస్వాములతో చర్చించి తర్వాత పార్టీ వైఖరిని వెల్లడిస్తామని రిజిజుకు చెప్పినట్లు తెలిసింది. అయితే డీలిమిటేషన్ బిల్లుపై కాంగ్రెస్ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని ఆ పార్టీ ఎంపీ కే.సి. వేణుగోపాల్ బుధవారం స్పష్టం చేశారు. గత పార్లమెంట్ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయానికే కట్టుబడి ఉన్నామని చెప్పారు. బడ్జెట్ సమావేశాల సమయంలో ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందలేదు. మహిళా రిజర్వేషన్ల పేరుతో దేశ రాజకీయ, జనాభా సమీకరణాలను మార్చే ప్రయత్నం జరుగుతోందనే ఆందోళనతోనే బిల్లును వ్యతిరేకించినట్లు కాంగ్రెస్ గతంలో తెలిపింది. అయితే ప్రస్తుతం ఉన్న లోక్‌సభ స్థానాల పరిధిలోనే మహిళా రిజర్వేషన్లు అమలు చేస్తే మద్దతు ఇస్తామని కాంగ్రెస్ ఇప్పటికే స్పష్టం చేసింది.

# సంపాదకీయం

## పులిచింతల ఎత్తిపోతలతో ఏపీకి విఘాతం!



కృష్ణానది జలాల వినియోగం విషయంలో ఇప్పటికే ఆంధ్రప్రదేశ్--తెలంగాణ మధ్య వివాదాలు కొనసాగుతున్నాయి. ఈ తరుణంలో పులిచింతల ప్రాజెక్టు పరిధిలో తెలంగాణ ప్రభుత్వం అవసరమైన అనుమతులు లేకుండా ఎత్తిపోతల పథకం ద్వారా రోజుకు 2,500 క్యూసెక్కుల నీటిని తరలించే ప్రయత్నాలు జరగడం రెండు రాష్ట్రాల మధ్య మరో వివాదానికి దారి తీస్తోంది. పులిచింతల ప్రాజెక్టు పరిధిలో తెలంగాణ భూభాగమైన బుగ్గ మాధారం--దొండపాడు గ్రామాల వద్ద కృష్ణానది ఒడ్డున రూ.394 కోట్లతో రాజీవ్ గాంధీ లిఫ్ట్ పథకానికి శ్రీకారం చుట్టి, రోజుకు 2,500 క్యూసెక్కుల నీటిని తరలించే సామర్థ్యంతో, కృష్ణానది నుంచి తెలంగాణలో కిలోమీటరు పరిధిలో పెద్ద కాల్వ నిర్మిస్తున్నట్లు సమాచారం. ఈ ఎత్తిపోతల పథకం దిగువ రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌కు నీటి ముప్పు తెచ్చిపెట్టనున్నది. ఈ ప్రాజెక్టు పనులు పూర్తయితే పల్నాడు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గంలో కృష్ణానదిపై ఉన్న 21 లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలకు సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. అంతేకాదు, ఆర్.డబ్ల్యూ.ఎస్ స్కీముల ద్వారా అందే తాగునీటికి కూడా తీవ్ర అంతరాయం కలుగుతుంది. ఎన్టీఆర్ జిల్లా నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాలతో కలిపి మొత్తం 51 లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు మూలనపడే ప్రమాదం ఉంది. దీనివల్ల దాదాపు 50 వేల ఎకరాలకు సాగునీరు అందక రైతులు తీవ్రంగా నష్టపోతారు.అసలు పులిచింతల ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశ్యం నదీప్రవాహాన్ని నియంత్రించి, దిగువ ప్రాంతానికి సాగునీరు అందించడం, తాగునీటి అవసరాలను తీర్చడం. పులిచింతల ప్రాజెక్టు నీటిపైనే కృష్ణా డెల్టా, గుంటూరు, పల్నాడు, ఎన్టీఆర్, బాపట్ల, కృష్ణా జిల్లాల రైతులు ఆధారపడి ఉన్నారు. నీటి లభ్యత లేకపోతే ఆ ప్రాంత పంటలపై ప్రభావం పడే అవకాశం ఉంది. ఈ ఎత్తిపోతల పథకం నిర్మాణం చట్టబద్ధమైన అనుమతులతోనే చేపట్టారా? లేక ఏకపక్షంగా నిర్మిస్తున్నారా? పులిచింతల ఎత్తిపోతలపై వస్తున్న ఆరోపణల మీద సంబంధిత అధికారులు వెంటనే విచారణ జరిపి, అనుమతులు, నీటి వినియోగం, నిర్మాణాల చట్టబద్ధతపై పూర్తి వివరాలను ప్రజలకు వెల్లడించాలి. అనుమతులు లేకుండా ఎత్తిపోతల నిర్మాణం జరిగితే అది తీవ్రమైన విషయంగా పరిగణించాలి. ఎగువ రాష్ట్రం చేపట్టే ప్రతి నీటి ప్రాజెక్టు, దిగువ రాష్ట్ర ప్రజల జీవనాధారాన్ని ప్రభావితం చేసే అవకాశం ఉంటుంది. కనుక ఆంధ్రప్రదేశ్ వ్యక్తం చేస్తున్న ఆందోళన లక్షలాది రైతుల భవిష్యత్తు, తాగునీటి భద్రత, సాగునీటి హక్కులకు సంబంధించినది.పులిచింతల దిగువన నీటిపై తెలంగాణకు ఎలాంటి అధికారిక హక్కులూ లేవు. అయినా తమ భూభాగంలో నిర్మించుకుంటున్నామని, వరద నీటినే వాడుకుంటామనే వాదనతో ఏకపక్షంగా తెలంగాణ ముందుకు వెళ్లడం వల్ల దిగువ రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలకు తీవ్ర విఘాతం కలగనున్నది. ఏపీ పునర్విభజన చట్టంలోని సెక్షన్ 84, 85 ప్రకారం కృష్ణా బేసిన్‌లో చేపట్టే ఏ కొత్త ఎత్తిపోతల పథకానికైనా కఠినమైన నిబంధనలు ఉన్నాయి. కేంద్ర జలశక్తి మంత్రి అధ్యక్షతన ఉండే అపెక్స్ కౌన్సిల్ ఆమోదంతో కృష్ణా బోర్డు (కెఆర్ఎంబి) అనుమతి తప్పనిసరి. అటవీ శాఖ క్లియరెన్సులు, నిపుణుల కమిటీ నుంచి ఇన్వెస్ట్‌మెంట్ క్లియరెన్స్ పొందాలి. పొరుగు రాష్ట్రానికి 10 కిలోమీటర్ల దూరంలో నిర్మించే ఏ ప్రాజెక్టుకైనా ఆ రాష్ట్ర అనుమతి తీసుకోవాలి. ఈ నిబంధనలన్నింటినీ విస్మరించి, కనీస అనుమతులు కూడా లేకుండా తెలంగాణ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును చేపట్టడం బాధ్యతారహితం. పులిచింతల దిగువన నీటిపై తెలంగాణ నిర్మిస్తున్న ఎత్తిపోతల పథకంపై కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ, సంబంధిత నదీ నిర్వహణ సంస్థలు, అవసరమైతే కృష్ణానది జలాల నిర్వహణకు సంబంధించిన సంస్థలు వాస్తవ పరిస్థితిని పరిశీలించి, చట్టబద్ధతపై స్పష్టత ఇవ్వాల్సి ఉంది. ఆంధ్రప్రదేశ్ రైతులకు సాగునీరు, తాగునీటి భద్రత, డెల్టా ప్రాంతాల భవిష్యత్తు దృష్ట్యా కృష్ణా జలాల వినియోగంపై ప్రతి నిర్ణయం రాజ్యాంగబద్ధంగా, న్యాయబద్ధంగా, పరస్పర అంగీకారంతోనే అమలు కావాలి.

# అణ్వస్త్ర రహిత ప్రపంచం కలయేనా?

జపాన్‌లోని హిరోషిమా, నాగసాకిలలో 1945 ఆగస్టు 6, 9 తేదీల్లో అమెరికా మొట్టమొదటిసారిగా అణ్వాయుధాలను ప్రయోగించింది. యురేనియంతో చేసిన 'లిటిల్ బోయ్' ఆయుధం హిరోషిమా నగరాన్ని ధ్వంసం చేసి, 80 వేలకు పైగా ప్రజల్ని చంపింది. ప్లూటోనియం బాంబు నాగసాకిలో ప్రయోగించగా పేలుళ్లలో 40 వేల మంది ప్రాణాలు కోల్పోయారు. తదుపరి రోజుల్లో ఈ మరణాలు రెండు లక్షలు దాటాయి. రేడియేషన్ ప్రభావం తరతరాలను వెంటాడింది. ఘోర పర్యవసానాలను జపాన్ ప్రజలు చవిచూశారు. ఇప్పుడు ప్రపంచంలో అంతకుమించి పదుల రెట్ల శక్తిమంతమైన బాంబులు పలు దేశాల వద్ద ఉన్నాయి. నేడు ప్రపంచంలోని అణ్వస్త్ర దేశాల వద్ద 12 వేలకు పైగా అణ్వస్త్రాలు ఉన్నాయి. వాటిలో అత్యధిక భాగం అమెరికా, రష్యాల వద్దే ఉన్నాయి. హిరోషిమా, నాగసాకిల విషాదం జరిగి 80 సంవత్సరాలు దాటినా ఇప్పటికీ అణ్వస్త్ర ముప్పు ప్రపంచ ప్రజల్ని ఆందోళనకు గురి చేస్తున్నది.ఇరాన్ అణ్వస్త్రాన్ని తయారు చేస్తోందనే నెపంతో... ప్రపంచంలో 5 వేల పైచిలుకు అణ్వస్త్రాల్ని కల్గి ఉన్న అమెరికా, ఇజ్రాయెల్‌తో కలిసి ఫిబ్రవరి 28 నుంచి ఆ దేశంపై యుద్ధం చేస్తున్నది. అణుశక్తిని శాంతియుత ఇంధన తయారీ కోసమే వాడతామని ఇరాన్ చెబుతున్నా, 2015లో ఇరాన్ ప్ా5ం1 దేశాలతో జీఙూూా అణు ఒప్పందం కుదుర్చుకున్నా, అమెరికా ఇంకా కట్టుకథల్నే వల్లిస్తూ, ఇరాన్‌తో పశ్చిమాసియాకు ముప్పని చెబుతోంది. విచిత్రమేమంటే ఇజ్రాయెల్ దగ్గర 200 పైగా అణ్వస్త్రాలున్నా అణ్వాయుధాల వ్యాప్తి నిరోధక ఒప్పందం (ఎన్.పి.టి)పై సంతకం చేయలేదు. జనవరి 1, 1967కు ముందు అణ్వాయుధాల్ని లేదా అణుపేలుళ్ల పరికరాలను తయారు చేసిన, పేల్చిన దేశాలను అణ్వాయుధ దేశాలుగా నిర్వచించారు. అంతర్జాతీయ అణుశక్తి సంస్థ 'ఐఏఈఏ'కు కీలకమైన ధ్రువీకరణ బాధ్యతలు అప్పగించారు. ఇజ్రాయెల్ తన అణ్వాయుధాల్ని పరిశీలించటానికి ఈ అంతర్జాతీయ అణుశక్తి సంస్థకు ఇంతవరకూ అనుమతినీయలేదు. కానీ ఇరాన్, తనిఖీకి అభ్యంతరం పెట్టలేదు. కనుక ఎవరి నుంచి ఎవరికి ముప్పో స్పష్టంగా తెలుస్తున్నది. ఎన్.పి.టి 1970 నుంచి అమలులోకి వచ్చింది. 1995 మే నెలలో ఈ ఒప్పందాన్ని నిరవధికంగా పొడిగించారు. 191 దేశాలు సంతకాలు చేశాయి. అణు నిరాయుధీకరణ, అణుశక్తి శాంతియుత వినియోగం కోసమే ఉండాలనీ, అణ్వాయుధాలను ఇతర అణుపేలుళ్ల పరికరాలను తయారు చేయకూడదని, మరే విధంగానూ వాడకూడదనే షరతులకు ఈ దేశాలు కట్టుబడి ఉండటంతో పాటు వేరే దేశాలకు అణు ఆయుధ తయారీలో సహాయపడకూడదు.

అంతర్జాతీయ రక్షణ పర్యవేక్షణ సంస్థగా ఐఏఈఏ ఒక నిర్దిష్ట ధ్రువీకరణ బాధ్యతను కలిగి ఉంది. అణ్వాయుధాలు లేని దేశాలు ఎన్.పి.టి కింద స్వీకరించిన బాధ్యతల అమలును ఈ సంస్థ ధ్రువీకరిస్తుంది. 2025 డిసెంబరు నాటికి అణ్వాయుధాలు లేని 183 దేశాలు ఈ సమగ్ర రక్షణ ఒప్పందాలను అమలులోకి తీసుకొచ్చాయి. ఎన్.పి.టిపై సంతకం చేయని ఇజ్రాయెల్ అణ్వాయుధాలను చట్టపరంగా ధ్రువీకరించుకోలేదు. 1960 నుంచి తన దగ్గర ఉన్న అణ్వాయుధాల గురించి ప్రపంచానికి తెలియ పర్చకుండా ప్రత్యర్థులను నిరోధించటానికి ప్రయత్నం చేస్తున్నది. ఇదిలా ఉండగా ఇటీవల సౌదీ అరేబియా కోసం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఒక ఒప్పందాన్ని ఆమోదించారు. దీని ప్రకారం సౌదీ అరేబియా తన సొంతగడ్డపై యురేనియంను సుసంపన్నం చేసుకునే సామర్థ్యంతో పౌర అణు కార్యక్రమాన్ని అభివృద్ధి చేసుకోటానికి వీలు ఉంటుంది. ఇది అమెరికా దీర్ఘకాలిక అణు నిరాయుధీకరణ విధానంలో ఒక ముఖ్యమైన మార్పును సూచిస్తుంది. ఈ ఒప్పందం ద్వారా సౌదీలో అమెరికా కంపెనీల అణు పరిశ్రమ నిర్మాణ మార్గాన్ని సులభం చేస్తుంది. అమెరికా--సౌదీ అరేబియాల మధ్య అణు సహకారంపై పలువురు అధ్యక్షుల హయాంలో చర్చలు కొనసాగాయి. ఇజ్రాయెల్‌ను దౌత్యపరంగా సౌదీ అరేబియా గుర్తించాలని తద్వారా అణు సహకారం అందిస్తామని జో బైడెన్ చెప్పారు. గాజాపై ఇజ్రాయెల్ మారణ హోమం తర్వాత ఆ చర్చలు నిలిచిపోయాయి. తాజాగా ట్రంప్ ప్రభుత్వం నిబంధనలను సడలించి చర్చలను పునరుద్ధరించిన తర్వాత కుదిరిన ఒప్పందం 30 సంవత్సరాల పాటు కొనసాగుతుంది. అణుశక్తి దిగ్గజం వెస్టింగ్‌హౌస్‌తో సహా పలు అమెరికా కంపెనీలు సౌదీ అరేబియాలో అణురంగ అభివృద్ధికి కృషి చేయటం ద్వారా భవిష్యత్తులో సౌదీ అరేబియాను అణ్వస్త్ర దేశంగా తయారు చేసే ప్రమాదం పొంచి ఉంది. దీనితో పశ్చిమాసియాలో శాంతి ఎండమావై, ఆయుధ పోటీతో ప్రమాదం పెరగనున్నది.

మరోవైపు చైనా ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో బలపడుతూ అమెరికాతో పోటీపడుతున్నది. పీపీపీ జీడీపీలో



(కొనుగోలు శక్తి సమాన జీడీపీ) అమెరికాను అధిగమించింది. ఇప్పటికే తన పీపీపీ 44 లక్షల కోట్ల డాలర్లతో అమెరికా కంటే ముందంజలో ఉంది. ఆర్థిక పోటీతో పాటు ప్రచ్ఛన్నయుద్ధంలో సోవియట్ యూనియన్‌తో జరిగినట్లుగా చైనా ఆయుధ పోటీ కూడా అమెరికాతో పెరుగుతున్నది. ఈస్ట్ ఈజ్ రైజింగ్ ఇప్పుడు అణ్వస్త్ర పోటీని కూడా తాకింది. 2020లో కేవలం 200 అణ్వస్త్రాలున్న చైనా, 2026 నాటికి 600కు పెంచుకుంది. 2035 నాటికి 1500 వరకూ అణ్వస్త్రాలు చైనా అంబులపొదిలోకి చేరుకొంటాయని అమెరికా అంచనా వేస్తోంది. చైనా, పాకిస్థాన్‌ల ఆయుధ పెరుగుదల మన దేశానికి కూడా శ్రేయస్కరం కాదు. ప్రపంచంలో అనేక ప్రజా సమస్యలున్నాయి. కనుక అణ్వస్త్ర ఉత్పత్తిని ఆపి అమెరికా, రష్యా, చైనాలు ఒక చోట కూర్చొని మొత్తం అణ్వస్త్రాలను నిర్వీర్యం చేయటంపై దృష్టిని కేంద్రీకరించాలి. ఇప్పటికే ఉన్న అణ్వస్త్రాలతో మన భూగోళాన్ని అనేకసార్లు విధ్వంసం చేయొచ్చు. ఇంకెందుకీ ఆయుధ పోటీ? ప్రపంచ దేశాలు అన్నవస్త్రాలపై, ఉద్యోగాలు, వైద్యం, శాంతి, పర్యావరణంపై దృష్టి సారిస్తామని భావితరాలకు భరోసానిస్తూ, 'హిరోషిమా దే' సందర్భంగా ప్రతిజ్ఞ పూనాలి.

# ఆత్మగౌరవ పోరాట పథ నిర్దేశకుడు

డాక్టర్ కొత్తపల్లి జయశంకర్ పేరు వినగానే తెలంగాణ ఉద్యమ చరిత్ర, ఆత్మగౌరవం, నిస్వార్థ సేవ, ప్రజా చైతన్యం, ప్రాంతీయ న్యాయం, శాస్త్రీయ ఆలోచన వంటివన్నీ ఒకేసారి గుర్తుకు వస్తాయి. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి పునాది వేసిన భావజాల శిల్పిగా, ఉద్యమానికి సిద్ధాంతకర్తగా, ప్రజలకు దిశానిర్దేశం చేసిన మహోన్నత మేధావిగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారు. అందుకే తెలంగాణ ప్రజలు ఆయనను ప్రేమతో 'తెలంగాణ జాతిపిత, తెలంగాణ సిద్ధాంతకర్త, తెలంగాణ ఉద్యమ మార్గదర్శి'గా గౌరవిస్తారు.జయశంకర్ 1934 ఆగస్టు 6న నాటి వరంగల్ జిల్లాలోని అక్కంపేట గ్రామంలో జన్మించారు. బాల్యం నుంచే ఆయనకు సామాజిక సమస్యలపై ఆసక్తి ఉండేది. విద్యార్థి దశలోనే ప్రాంతీయ అసమానతలను గమనించారు. నిజాం పాలన అనంతరం హైదరాబాద్ రాష్ట్ర విలీనం, ఆ తరువాత ఆంధ్రప్రదేశ్ ఏర్పాటుతో తెలంగాణ ప్రజలకు జరుగుతున్న అన్యాయాలను దగ్గరగా అధ్యయనం చేశారు. విద్య, ఉద్యోగాలు, సాగునీరు, బడ్జెట్ కేటాయింపులు, పరిశ్రమలు వంటి అన్ని రంగాలలో తెలంగాణ వెనుకంజలో ఉన్నదని గణాంకాలతో సహా నిరూపించారు. అందుకే ఆయనను 'నడిచే విజ్ఞాన సర్వస్వం'గా అనేకమంది అభివర్ణించారు. భావోద్వేగాలతో కాకుండా శాస్త్రీయ విశ్లేషణలతో ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లిన అరుదైన మేధావి ఆయన.

1952లో జరిగిన ముల్కీ ఉద్యమంలో పాల్గొన్న జయశంకర్, అప్పుడే తెలంగాణ ప్రజల హక్కుల కోసం పోరాటం చేయాలని సంకల్పించుకున్నారు. 1956లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన తరువాత... పెద్దమనుషుల ఒప్పందం, ముల్కీ నిబంధనలు, ప్రాంతీయ హామీలు అమలు కాకపోవడం వల్ల తెలంగాణ ప్రజలు తీవ్ర నష్టాన్ని ఎదుర్కొంటున్నారని నివేదికలు, గణాంకాలతో నిరూపించారు.

ఆర్థికశాస్త్రంలో ఉన్నత విద్యాభ్యాసం చేసిన జయశంకర్, ఉపాధ్యాయుడిగా తన వృత్తిని ప్రారంభించారు. తరువాత కళాశాల అధ్యాపకుడిగా, ప్రిన్సిపాల్‌గా, విశ్వవిద్యాలయ పరిపాలనలో కీలక బాధ్యతలు నిర్వహించి చివరకు కాకతీయ విశ్వవిద్యాలయం ఉపకులపతిగా సేవలందించారు.

జయశంకర్ రచనలు తెలంగాణ ఉద్యమానికి దిక్సూచిగా నిలిచాయి. 1969 తెలంగాణ ఉద్యమం ఆయన జీవితంలో కీలక మలుపు. వేలాది మంది విద్యార్థులు వీధుల్లోకి వచ్చిన ఆ ఉద్యమానికి మేధోబలాన్ని అందించిన వ్యక్తుల్లో జయశంకర్ ప్రధానులు. ఉద్యమాన్ని అణచివేసినా ఆయన వెనక్కు తగ్గలేదు. 'ఉద్యమాలు తాత్కాలికంగా ఆగవచ్చు కానీ ప్రజల ఆకాంక్షలు ఎప్పటికీ చనిపోవు' అనే నమ్మకంతో తన పరిశోధనలను కొనసాగించారు. ఆయన ఎప్పుడూ ప్రాంతీయ విద్వేషం చూపలేదు. ఇతర ప్రాంతాల ప్రజలపై ద్వేషం చూపకుండా, తెలంగాణకు న్యాయం జరగాలని మాత్రమే కోరారు.తెలంగాణ ఉద్యమం రెండో దశలోనూ ఆయన కీలక పాత్ర పోషించారు. రాజకీయ నాయకులకు, విద్యార్థి సంఘాలకు, ఉద్యోగ సంఘాలకు, మేధావులకు ఒకే లక్ష్యం చూపిస్తూ ఉద్యమాన్ని సమన్వయం చేశారు. 'తెలంగాణ రాష్ట్రం ఏర్పడటం వ్యక్తుల విజయం కాదు, ప్రజల సంకల్ప విజయం కావాలి' అని ఆయన చెప్పిన మాటలు ఉద్యమానికి నైతిక బలాన్నిచ్చాయి. జయశంకర్ వ్యక్తిత్వంలో అత్యంత గొప్ప లక్షణం నిస్వార్థం. సాదాసీదా జీవితం గడిపారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం కోసం జీవితాన్ని అంకితం చేశారు. ప్రజల మధ్యే జీవించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడటమే తన జీవిత లక్ష్యమని ప్రకటించి, చివరి శ్వాస వరకు ఆ ధ్యేయంతో పనిచేశారు.



ఆయన ప్రసంగాలలో ఎప్పుడూ ఒక విషయం స్పష్టంగా కనిపించేది. తెలంగాణ అభివృద్ధి అంటే కేవలం కొత్త రాష్ట్రం ఏర్పడటం మాత్రమే కాదని, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, గ్రామీణాభివృద్ధి, సాగునీటి విస్తరణ, నాణ్యమైన విద్య, యువతకు ఉపాధి, రైతుల సంక్షేమం, మహిళల సాధికారత కలిసివచ్చినప్పుడే నిజమైన తెలంగాణ నిర్మాణం సాధ్యమవుతుందని జయశంకర్ వివరించేవారు. ఆయన ఆలోచనలు రాష్ట్ర ఏర్పాటుతో ముగిసిపోలేదు; తెలంగాణ భవిష్యత్తుకు మార్గదర్శక సూత్రాలుగా నిలిచాయి.

డాక్టర్ కొత్తపల్లి జయశంకర్ జీవితం-- ఒక వ్యక్తి ఎంతటి మార్పుకు కారణం కావచ్చో నిరూపించిన మహోన్నత ఉదాహరణ. తెలంగాణ చరిత్రలో ఆయన స్థానం శాశ్వతం. ఆగస్టు 6న ఆయన జయంతిని జరుపుకోవడం అంటే ఒక మహనీయుడిని స్మరించుకోవడం మాత్రమే కాదు; ఆయన ఆశయాలను, ఆలోచనలను, ప్రజాసేవా దృక్పథాన్ని తదుపరి తరాలకు అందించడం కూడా.

# 20 నెలల్లో తెలంగాణకు 150 జీసీసీలు -- 1.5 లక్షల ఉద్యోగాలు

ఆగస్టు 6 హంసకాలం వార్త )

ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో జేఎల్ఎల్ గ్లోబల్ కెపబిలిటీ సెంటర్‌ను ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు గత 20 నెలల కాలంలో తెలంగాణలో కొత్తగా 150 గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు (జీసీసీలు) ఏర్పాటై, వాటి ద్వారా సుమారు 1.5 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించినట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. గురువారం ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ప్రముఖ సంస్థ జేఎల్ఎల్ ( జే ఎల్ ఎల్ ) ఏర్పాటు చేసిన గ్లోబల్ కెపబిలిటీ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడులకు అనువైన ప్రాంతాలను గుర్తించి సిఫారసు చేసే ప్రముఖ సంస్థగా జేఎల్ఎల్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందని, అలాంటి సంస్థ హైదరాబాద్‌ను తన గ్లోబల్ కెపబిలిటీ సెంటర్‌కు కేంద్రంగా ఎంపిక చేసుకోవడం తెలంగాణ సామర్థ్యానికి నిదర్శనమని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఐటీ రంగంలో వేగంగా మార్పులు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో ఇన్నోవేషన్ ఆధారిత జీసీసీలు భవిష్యత్ ఉపాధి కల్పనలో కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. కృత్రిమ మేధ ( ఏఐ), ఆటోమేషన్ ప్రభావంతో సాంకేతిక రంగంలో మార్పులు వచ్చినప్పటికీ జీసీసీల ప్రాధాన్యం మరింత పెరుగుతోందని తెలిపారు. తెలంగాణలో జీసీసీల వేగవంతమైన విస్తరణకు ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, పరిశ్రమలకు అనుకూలమైన ప్రభుత్వ విధానాలు ప్రధాన కారణాలని మంత్రి వివరించారు. హైదరాబాద్ అభివృద్ధిలో ఔటర్ రింగ్ రోడ్ ఎంత కీలకమో, ఇప్పుడు రీజినల్ రింగ్ రోడ్, ఏఐ సిటీ, భారత్ ఫ్యూచర్ సిటీ వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు భవిష్యత్ పెట్టుబడులకు బలమైన పునాది వేస్తాయని చెప్పారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందిస్తూ, ఏఐ, డీప్‌టెక్, సెమీకండక్టర్ వంటి అధునాతన సాంకేతిక రంగాలకు అవసరమైన మానవ వనరులను తెలంగాణ ప్రభుత్వం సిద్ధం చేస్తోందని తెలిపారు.దేశంలో హైదరాబాద్‌కు 16 శాతం వాటా2024 నుంచి 2026 మధ్య దేశవ్యాప్తంగా జీసీసీల కార్యాలయ లీజింగ్‌లో హైదరాబాద్ 16 శాతం వాటా సాధించిందని మంత్రి వెల్లడించారు. అదే సమయంలో నగరంలో జరిగిన మొత్తం కార్యాలయ లీజింగ్‌లో జీసీసీల వాటా 42 శాతానికి చేరుకోవడం హైదరాబాద్ ప్రపంచ పెట్టుబడిదారులకు ప్రధాన గమ్యస్థానంగా ఎదుగుతోం దనడానికినిదర్శనమని పేర్కొన్నారు.ఆరోగ్య సంరక్షణ, బయోటెక్నాలజీ, సెమీకండక్టర్ రంగాలకు చెందిన జీసీసీల ఏర్పాటులోనూ హైదరాబాద్ మొదటి ఎంపికగా నిలుస్తోందని, దీంతో నగరం ఐటీ హబ్‌గా మాత్రమే కాకుండా అత్యాధునిక సాంకేతిక రంగాల్లో ప్రపంచ స్థాయి ఆవిష్కరణలకు కేంద్రంగా రూపుదిద్దుకుంటోందని అన్నారు.జేఎల్ఎల్ కేంద్రంతో 1,600 మందికి ఉపాధి జేఎల్ఎల్ ఏర్పాటు చేసిన



గ్లోబల్ కెపబిలిటీ సెంటర్ పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించిన తర్వాత వచ్చే రెండేళ్లలో సుమారు 1,600 మందికి ఉద్యోగా వకాశాలు లభించనున్నాయి. ఈ కేంద్రం ద్వారా ఫైనాన్స్, మానవ వనరులు, ప్రాజెక్టు నిర్వహణ, లీజ్ అడ్మినిస్ట్రేషన్, అడ్వాన్స్‌డ్ అనలిటిక్స్, టెక్నాలజీ ఆధారిత సేవలను ప్రపంచవ్యాప్తంగా జేఎల్ఎల్ కార్యకలాపాలకు అందించనుంది. ఈ కార్యక్రమంలో జేఎల్ఎల్ ఇండియా సీఈఓ రాధా ధిర్, హైదరాబాద్ సీనియర్ మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ పట్నాయక్, గ్లోబల్ సర్వీస్ సెంటర్ హెడ్ ధీరజ్ పోప్లీ, ఐటీ శాఖ సలహాదారు సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కూకట్‌పల్లి డివిజన్‌లో ఘనంగా బోనాల ఉత్సవాలు - ప్రత్యేక పూజల్లో పాల్గొన్న బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు





ఆగస్టు 6 హంస కలంవార్త

ఆషాఢ మాస బోనాల మహోత్సవాల సందర్భంగా రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని దేవినగర్ పోచమ్మ ఆలయం, దయార్‌గూడ నల్ల పోచమ్మ ఆలయం, ప్రకాశ్‌నగర్ చేపల బస్తీ పోచమ్మ ఆలయాలను ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయా ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు సమర్పించి ఆశీస్సులు పొందారు. అనంతరం భక్తులతో కలిసి బోనాల ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారి దర్శనం చేసుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు గారికి శాలువా కప్పి ఘనంగా సత్కరించి స్వాగతం పలికారు.ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ప్రజలంతా భక్తిశ్రద్ధలతో అమ్మవారిని ఆరాధించడం ఆనందదాయకమని పేర్కొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని, రాష్ట్రంలో సుభిక్షం నెలకొని ప్రతి కుటుంబం ఆనందంగా జీవించాలని ప్రార్థించినట్లు తెలిపారు.



అలాగే యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభించాలని, రైతులు, కార్మికులు, మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని, తెలంగాణ రాష్ట్రం మరింత ప్రగతి సాధించాలని అమ్మవారిని వేడుకున్నట్లు పేర్కొన్నారు. కూకట్‌పల్లి ప్రజలందరికీ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి డివిజన్ బీజేపీ సీనియర్ నాయకులు చేదురుపల్లి శ్రీనివాస్ గౌడ్, నర్సింగ్ రావు, అనంత నాగరాజు, దుర్గా ప్రసాద్ రావు, ప్రశాంత్ రావు, అకింపల్లి సాయి, చంద్రప్రకాశ్ రెడ్డి, భాను, శివ పటేల్, రమణారెడ్డి, ఫణీంద్ర శర్మ, వినయ్, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మహిళా భక్తులు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలు భావితరాలకు ఆదర్శం -- దొడ్ల వెంకటేష్ గౌడ్

(ఆగస్టు 6 హంస కాలంవార్త )

తెలంగాణ సిద్ధాంతకర్త, మహనీయులు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ గారి జయంతి సందర్భంగా ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని జయశంకర్ నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా దొడ్ల వెంకటేష్ గౌడ్ గారు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాంతం అంకితభావంతో పోరాడిన ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ ఉద్యమానికి సిద్ధాంతకర్తగా నిలిచారని అన్నారు. తెలంగాణ ప్రాంతానికి జరిగిన అన్యాయాన్ని గణాంకాలు, వాస్తవాలతో దేశం ముందు ఉంచి, ఆరు దశాబ్దాలకు పైగా తెలంగాణ ఉద్యమాన్ని సజీవంగా కొనసాగించడంలో ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలు, విలువలు, ఉద్యమ స్ఫూర్తి భావితరాలకు ఎల్లప్పుడూ ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. సమాజ అభివృద్ధికి విద్య, సామాజిక చైతన్యం, ప్రజాసంక్షేమం అత్యంత ముఖ్యమని ఆయన బోధించిన



సందేశాన్ని ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రజలు ఆయన సేవలను ఎన్నటికీ మరువరని, ఆయన చూపిన మార్గంలో నడవడం ద్వారా నిజమైన నివాళి అర్పించిన వారమవుతామని అన్నారు.ఈ కార్యక్రమంలో పోశెట్టి గౌడ్, మహమ్మద్ రఫీ,



రాజమణి గౌడ్, అంజలి, కాలనీ వాసులు, మహిళలు, స్థానిక నాయకులు, యువకులు తదితరులు పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్ గారికి ఘనంగా నివాళులర్పించారు.

## సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయించి అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి : బండి రమేష్



(ఆగస్టు 6 హంస కలంవార్త )

కూకట్‌పల్లి నియోజకవర్గంలోని ప్రజా సమస్యల పరిష్కారం కోసం అవసరమైన నిధులు కేటాయించి అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, టీపీసీసీ ఉపాధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన ని కోరారు. గురువారం కమిషనర్ సృజన ని కలిసి కూకట్‌పల్లి నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలు, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపై వినతిపత్రం అందజే శారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, మూసాపేట్ వై జంక్షన్ ఫ్లైఓవర్ నిర్మాణానికి సంబంధించిన సమస్యలు చాలా కాలంగా కొనసాగు తున్నాయని, మూసాపేట్ రోడ్డు విస్తరణ పనులు, లేక్ వ్యూ ప్రాంత అభివృద్ధి, బాలానగర్ నాలాల ఆధునీకరణ, సిల్ట్ తొలగింపు పనులు ఇంకా పూర్తికాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే నియోజకవర్గంలోని అనేక కాలనీల్లో రహదారులు పూర్తిగా దెబ్బతిని ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారని, వాటి మరమ్మతులకు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. పార్కుల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేసి, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. బండి రమేష్ వినతిపై సానుకూలంగా స్పందించిన కమిషనర్ సృజన , సమస్యలన్నింటినీ పరిశీలించి అవసరమైన నిధులు కేటాయించి అభివృద్ధి పనులను వీలైనంత త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## బెంగళూరులో నేడు జాతీయ ఓబీసీ మహాసభ



( ఆగస్టు 6 హంస కలంవార్త)

దేశవ్యాప్తంగా 5 వేల మంది ఓబీసీ ప్రతినిధుల హాజరు -- అన్ని ఏర్పాట్లు పూర్తి: జాజుల శ్రీనివాస్ గౌడ్ స్థలం: బెంగళూరు కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు దేశవ్యాప్తంగా ఓబీసీలను ఏకం చేయాలనే లక్ష్యంతో ఆగస్టు 7న (నేడు) బెంగళూరులో నిర్వహించనున్న జాతీయ ఓబీసీ మహాసభకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. మహాసభ ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, మండల్ కమిషన్ సిఫార్సుల అమలు ప్రకటన జరిగిన చారిత్రక రోజైన ఆగస్టు 7ను పురస్కరించుకుని ప్రతి ఏడాది దేశంలోని వివిధ రాష్ట్రాల్లో జాతీయ ఓబీసీ మహాసభలను నిర్వహిస్తున్నామని తెలిపారు. గత పదేళ్లుగా ఆంధ్రప్రదేశ్ నుంచి ఉత్తరప్రదేశ్ వరకు వివిధ రాష్ట్రాల్లో ఈ మహాసభలు విజయవంతంగా నిర్వహించామని, ఈ ఏడాది కర్ణాటక రాజధాని బెంగళూరు వేదికగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. బెంగళూరు సిటీ యూనివర్సిటీలోని డాక్టర్ మన్మోహన్ సింగ్ జ్ఞాన జ్యోతి ఆడిటోరియంలో ఉదయం 10 గంటలకు అఖండ జ్యోతి ప్రజ్వలనతో మహాసభ ప్రారంభం కానుందని తెలిపారు. దేశంలోని 29 రాష్ట్రాల నుంచి సుమారు 5 వేల మంది ఓబీసీ ప్రతినిధులు ఈ మహాసభకు హాజరుకానున్నట్లు వెల్లడించారు. ఈ జాతీయ మహాసభకు కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్, కేపీసీసీ అధ్యక్షులు హరి ప్రసాద్, తెలంగాణ పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల మంత్రులు, అన్ని రాజకీయ పార్టీలకు చెందిన పార్లమెంట్ సభ్యులు, జాతీయ స్థాయి ఓబీసీ నాయకులు, సామాజిక సంస్థల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. దేశవ్యాప్తంగా ఓబీసీల ఐక్యత, రాజ్యాంగబద్ధ హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం, విద్య, ఉపాధి, రాజకీయ ప్రాతినిధ్యం వంటి కీలక అంశాలపై మహాసభలో చర్చించి పలు తీర్మానాలు ఆమోదించనున్నట్లు జాజుల శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు కేసిన శంకర్రావు, రాష్ట్రీయ ఓబీసీ మహాసంగ్ మహారాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ పవన్ రాజ్ తైవాడే, కర్ణాటక రాష్ట్ర అధ్యక్షులు కుర్ర లక్ష్మణ్, సచిన్ రాజోల్కర్, జాతీయ నాయకులు గుజ్జ కృష్ణ, తాటికొండ విక్రమ్ గౌడ్, కుల్కాచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, కనకాల శ్యాం కురుమ, రావులకోల్ నరేష్ ప్రజాపతి, టీ. నందగోపాల్, పానుగంటి విజయ్, షకీల్ తదితరులు పాల్గొన్నారు.

## యువతే పార్టీకి వెన్నెముక -- గ్రామస్థాయి నుంచి పోరాట స్ఫూర్తిని పెంపొందించాలి



( ఆగస్ట్ 6 హంస కాలంవార్త)

యువజన విభాగం సమావేశంలో టీఆర్పీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పిలుపు స్థలం: టీఆర్పీ కేంద్ర కార్యాలయం, హైదరాబాద్ తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ) కేంద్ర కార్యాలయంలో పార్టీ యువజన విభాగంతో టీఆర్పీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ప్రత్యేక సమావేశం నిర్వహించారు. యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బొడ్డుపల్లి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర, జిల్లా నాయకులతో పార్టీ విస్తరణ, యువత పాత్ర, భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ, యువతే పార్టీకి వెన్నెముక, సమాజ మార్పుకు అసలైన శక్తి అని అన్నారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ సిద్ధాంతాలు, లక్ష్యాలను ప్రతి గ్రామం, ప్రతి మండలం, ప్రతి కళాశాలకు తీసుకెళ్లే బాధ్యత యువజన విభాగంపైనే ఉందని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ యువతలో రాజకీయ చైతన్యాన్ని పెంపొందించాలని సూచించారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని, ప్రతి గ్రామం, ప్రతి మండలంలో యువజన కమిటీలను బలోపేతం చేయాలని ఆయన ఆదేశించారు. సోషల్ మీడియాను సమర్థవంతంగా వినియోగించి పార్టీ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు యువతను పెద్దఎత్తున పార్టీలోకి ఆహ్వానించాలని పిలుపునిచ్చారు. విద్య, ఉద్యోగాలు, బీసీల రాజ్యాధికారం, సామాజిక న్యాయం, యువత సంక్షేమం వంటి ప్రజా సమస్యలపై యువజన విభాగం ముందుండి ఉద్యమాలు చేపట్టాలని సూచించారు. పార్టీ కార్యక్రమాల్లో క్రమశిక్షణ, అంకితభావం, ప్రజలతో నిరంతర అనుబంధమే విజయానికి పునాదిగా నిలుస్తుందని మల్లన్న పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణ రాజ్యాధికార పార్టీని గ్రామస్థాయి నుంచి రాష్ట్రవ్యాప్తంగా మరింత బలోపేతం చేయడంలో యువజన విభాగం కీలక పాత్ర పోషించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ ప్రధాన కార్యదర్శి గంగాధర్ లింగాల, ఉపాధ్యక్షులు ఎల్లబోయిన ఓదెలు యాదవ్, క్రమశిక్షణ కమిటీ చైర్మన్ బంధారపు నర్సయ్య గౌడ్, స్టేట్ ఆఫీస్ కో-ఆర్డినేటర్ లింగం యాదవ్, రాష్ట్ర, జిల్లా యువజన విభాగం నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆషాఢ బోనాల సందర్భంగా మూసాపేట్ డివిజన్‌లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించిన టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం





( ఆగస్టు 6 హంస కాలంవార్త )

స్థలం: హైదరాబాద్ ఆషాఢ మాస బోనాల మహోత్సవాల సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గంలోని మూసాపేట్ డివిజన్ పరిధిలోని పలు శ్రీ పోచమ్మ తల్లి దేవాలయాలను పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా డా. సత్యం శ్రీరంగం భక్తులతో కలిసి బోనాలు సమర్పించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురా రోగ్యాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లా లని, తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు గారు డా. సత్యం శ్రీరంగం తో కలిసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, ఈ పండుగ సమాజంలో ఐక్యత, భక్తి భావాలను పెంపొందిస్తుందని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బాలాజీ నగర్ డివిజన్ మాజీ అధ్యక్షులు కృష్ణ రాజ్‌పుత్, కైత్లాపూర్ డివిజన్ అధ్యక్షులు కలికోట శంకర్, సునీల్ యాదవ్, టింక్కు, సప్పిడి భాస్కర్, సలీమ్, స్వరూప్ గౌడ్, అంజిరెడ్డి, స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా భక్తులు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆషాఢ బోనాల సందర్భంగా గ్రామదేవతల ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు

















( ఆగస్టు 6 హంస కాలంవార్త )

ఆషాఢ మాస బోనాల మహోత్సవాల సందర్భంగా రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు గారు మూసాపేట్ డివిజన్ పరిధిలోని పలు గ్రామదేవతల ఆలయాలను ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు సందర్శించి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు సమర్పించి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన బోనాల పండుగ భక్తి, ఐక్యత, సామాజిక సామరస్యానికి ప్రతీక అని అన్నారు. అమ్మవారి కృపతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు నెలకొని, ప్రతి కుటుంబం సంతోషంగా జీవించాలని, యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభించాలని, రైతులు పంటలతో సుభిక్షంగా ఉండాలని, కార్మికులు, మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. తెలంగాణ ప్రజలందరికీ బోనాల పండుగ శుభాలు చేకూరాలని ఆకాంక్షించారు. ఆలయ కమిటీ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ని ఘనంగా సన్మానించి, ప్రత్యేక పూజల్లో పాల్గొనడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మూసాపేట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కోడిచెర్ల మహేందర్, బీజేపీ సీనియర్ నాయకులు ఐలయ్య యాదవ్, మల్లేష్ గౌడ్, తూమ్ శైలేష్, అత్తికారి మల్లేష్, సతీష్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, శేఖర్ గుప్తా, జీవన్, నర్సింగ్, ఈ. సాయి, రవి గౌడ్ తదితరులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శేరిలింగంపల్లిలో ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి వేడుకలు ఘన నివాళులర్పించిన పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ









(ఆగస్టు 6 హంస కాలంవార్త )

తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త, మహనీయుడు ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ జయంతి సందర్భంగా శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని ప్రొఫెసర్ జయశంకర్ సార్ సర్కిల్ (రైల్వే అండర్ బ్రిడ్జి) వద్ద ఘనంగా జయంతి వేడుకలు నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి పి ఎస్ సి చైర్మన్ ఆరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా హాజరై, మాజీ కార్పొరేటర్ శ్రీ రాగం నాగేందర్ యాదవ్ గారితో కలిసి ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ పోషించిన పాత్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. ఆరు దశాబ్దాల పాటు తెలంగాణ ఉద్యమానికి సిద్ధాంతపరమైన దిశానిర్దేశం చేసి, తెలంగాణ ప్రజల స్వరాష్ట్ర ఆకాంక్షను ప్రపం చానికి చాటిన మహోన్నత మేధావి జయశంకర్ సార్ అని కొనియాడారు. జీవితాంతం తెలంగాణ ప్రజల హక్కులు, ఆత్మగౌరవం కోసం నిరంతరం పోరాడిన మహనీయుడిగా ఆయన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. తెలంగాణ బిడ్డల కలలను సాకారం చేయడంలో జయశంకర్ సార్ చేసిన కృషి ఎన్నటికీ మరువలేనిదని అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ సార్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ముఖ్యంగా యువత ఆయన చూపిన మార్గంలో నడుస్తూ తెలంగాణ అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని ఆరెకపూడి గాంధీ పిలుపుని చ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు వీరేశం గౌడ్, మాజీ కౌన్సిలర్ రవీందర్ రావు, సీనియర్ నాయకులు కొండల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్, కే. రాంచందర్, వార్డు సభ్యురాలు శ్రీకళ, సాయన్న, గోవింద్ చారి, పురం విష్ణువర్ధన్ రెడ్డి, గఫూర్, శ్రీకాంత్ దేవులపల్లి, సత్యనారాయణ, బస్వయ్య, వెంకట్ రాములు, నటరాజ్, రాజేందర్, సాంబయ్య, సుధాకర్, యూ. సత్యనారాయణ, సయ్యద్ మీర్ అలీ, కుటుంబరావు, మహేందర్ సింగ్, ప్రభాకర్ యాదవ్, రఘువీర్, సమీర్, మహేష్, సాయి కిరణ్, ప్రదీప్ యాదవ్, దానయ్య, వెంకటయ్య, కే. రవి, వినయ్, సాయి, మహిళా నాయకులు కమారి, రాములమ్మ, ముంతాజ్ బేగం, గౌసియా, లక్ష్మి, సబియా, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ ట్రస్ట్ కాలేజీలో ఫుడ్ పాయిజన్ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి: ఆమ్ ఆద్మీ పార్టీ

( ఆగస్ట్ 6 హంస కాలంవార్త )

స్థలం: హైదరాబాద్ చిలుకూరు--హిమాయత్‌నగర్‌లోని ఎన్టీఆర్ ట్రస్ట్ కాలేజీలో ఇటీవల జరిగిన ఫుడ్ పాయిజన్ ఘటనలో సుమారు 150 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు సమాచారం రావడం తీవ్ర ఆందోళన కలిగించే విషయమని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ హేమా సుదర్శన్ జిల్లోజు అన్నారు. ఈ ఘటనపై వాస్తవాలను తెలుసు కునేందుకు ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధులు మీడియా సభ్యులతో కలిసి గురువారం కాలేజీని సందర్శిం చారు. అయితే కాలేజీ సీఈవో కార్యాలయంలో ఉన్నప్పటికీ మీడియాతో మాట్లాడేం దుకు నిరాకరిం చారని, యాజమాన్యం బాధ్యతారా హిత్యంగా వ్యవహ రించడం ఖండనీయమని హేమా సుదర్శన్ జిల్లోజు విమర్శించారు. కాలేజీలో నాసిరకం, ముదిరిపోయిన కూరగాయలను ఉపయో గిస్తున్నారని ఓ విద్యార్థి తండ్రి చేసిన ఆరోపణలు మరింత ఆందోళనకు గురిచేస్తున్నాయని ఆమె పేర్కొన్నారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికీ తావు ఉండకూడదని, వారి ప్రాణాలతో చెలగాటమాడే హక్కు ఎవరికీ లేదని స్పష్టం చేశారు. ఎన్టీఆర్ ట్రస్ట్ పేరుతో ఇంటర్మీడి యట్ విద్యార్థుల నుంచి ప్రస్తుతం సుమారు రూ. 2.05 లక్షల ఫీజు వసూలు చేస్తున్నారని, వచ్చే విద్యా సంవత్సరంలో దానిని రూ.2.20 లక్షలకు పెంచనున్నట్లు ప్రచారం జరుగు తోందని పేర్కొన్నారు. భారీ ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యం విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన, సురక్షితమైన ఆహారం అందించడం తమ ప్రాథమిక బాధ్యత అని అన్నారు. ఫుడ్ పాయిజన్ ఘటనపై ప్రభుత్వం తక్షణమే సమగ్ర విచారణ జరిపి, నిర్లక్ష్యానికి పాల్పడిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమ్ ఆద్మీ పార్టీ డిమాండ్ చేసింది. అలాగే విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందేలా పటిష్టమైన పర్యవేక్షణ వ్యవస్థను అమలు చేయాలని కోరింది. ట్రస్ట్ పేరుతో విద్యార్థుల ఆరోగ్యం, భద్రతను నిర్లక్ష్యం చేస్తున్న యాజమాన్యంపై




తగిన చర్యలు తీసుకోవడంతో పాటు, ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వాస్తవాలను ప్రజల ముందుం చాలని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ హేమా సుదర్శన్ జిల్లోజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ సీనియర్ నాయకులు రాకేష్ రెడ్డి, రాష్ట్ర కిసాన్ వింగ్ అధ్యక్షులు నేరేటి ఆంజనేయులు, రాష్ట్ర నాయకులు దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. -- హేమా సుదర్శన్ జిల్లోజు రాష్ట్ర కన్వీనర్, ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ

# గచ్చిబౌలి అభివృద్ధికి ప్రాధాన్యం-ఎండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి చైర్మన్ ఆరెకపూడి గాంధీ







(ఆగస్టు 6 హంస కలంవార్త )

గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గుల్మొహార్ కాలనీలో నిర్వహించిన "వన్ డే -- వన్ వార్డ్" కార్యక్రమంలో భాగంగా కాలనీల్లో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ , సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ శ్రీమతి జి. సృజన, ఐఏఎస్, జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ మాలెంపాటి, డిప్యూటీ కమిషనర్ శ్రీ సేవా ఇస్లావత్, సీఎంసీ వివిధ విభాగాల అధికారులు, కాలనీల రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ, "వన్ డే -- వన్ వార్డ్" కార్యక్రమం ద్వారా అధికారులు, ప్రజాప్రతి నిధులు, కాలనీవాసులతో నేరుగా సమావేశమై సమస్యలను తెలుసుకోవడం వల్ల వాటి పరిష్కారం మరింత వేగంగా సాధ్యమవుతుందని అన్నారు. కాలనీవాసులు రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు, తాగునీరు, పార్కుల అభివృద్ధి తదితర సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యంగా తీసుకొని పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను ఎలాంటి జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. గచ్చిబౌలి డివిజన్‌లో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాలు, తాగునీటి సౌక ర్యాలతో పాటు అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతు న్నామని పేర్కొన్నారు. అదేవిధంగా పార్కులను ఆధునిక హంగులతో అభివృద్ధి చేసి, ఓపెన్ జిమ్‌లు, పిల్లలు మరియు వృద్ధులు సేదతీరేందుకు అవసర మైన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. ప్రతి కాలనీలో ఆహ్లాదకరమైన, పరిశు భ్రమైన వాతావరణం



ఉండేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన ఐఏఎస్‌తో గచ్చిబౌలి వార్డు పరిధిలోని పెండింగ్ అభివృద్ధి పనులపై ప్రత్యేకంగా చర్చించినట్లు ఆరెకపూడి గాంధీ తెలి పారు. అసంపూర్తిగా ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని, అభివృద్ధి పనులకు తగిన నిధులు మంజూరు చేసి సీసీ రోడ్లు, రోడ్ల మరమ్మతులు, డ్రైనేజీ, పార్కుల అభివృద్ధి వంటి పనులను వేగవంతం చేయాలని కోరినట్లు వెల్లడించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని నాలాల విస్తరణ పనులను అత్యవసరంగా పూర్తి చేసి వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ప్రతి కాలనీలో పార్కుల సుందరీకరణ చేపట్టి ప్రజలకు మెరుగైన వాతావరణం కల్పించాలని సూచించారు. ప్రతి ఇంటిలో తప్పనిసరిగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి వర్షపు నీటిని భూగర్భంలోకి ఇంకేలా చూడాలని, తడి-పొడి చెత్తను వేర్వేరుగా అందించి పరిశుభ్రమైన కాలనీల నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అలాగే పారిశుధ్య సిబ్బంది చెత్తాచెదారం, మట్టి కుప్పలను ఎప్పటికప్పుడు తొలగించి పరిశుభ్రతను కాపాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఎంసీ ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, జలమండలి విభాగాల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యల పరిష్కారమే బహుజన వర్కర్స్ యూనియన్ ప్రధాన లక్ష్యం








( ఆగస్టు 6 హంస కాలంవార్త )

కంటోన్మెంట్, పికెట్ డిపోల్లో ఆర్టీసీ కార్మికులను కలిసిన బీడబ్ల్యూయూ రాష్ట్ర నాయకత్వం స్థలం: హైదరాబాద్ తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ) అనుబంధ బహుజన వర్కర్స్ యూనియన్ ( బి డబ్ల్యు ) గ్రేటర్ హైదరాబాద్ గౌరవ అధ్యక్షులు టీవీఆర్ ( టి విఆర్ ) ఆధ్వర్యంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు గురువారం కంటోన్మెంట్, పికెట్ ఆర్టీసీ డిపోలను సందర్శించి కార్మికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్మికులతో సమావేశమైన నాయకులు మాట్లాడుతూ, ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణే బహుజన వర్కర్స్ యూనియన్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు యూనియన్ నిరంతరం కృషి చేస్తుందని భరోసా ఇచ్చారు. కార్మికులు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా ధైర్యంగా యూనియన్‌ను సంప్రదించాలని, వారి న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ప్రతి స్థాయిలో పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం కంటోన్మెంట్, పికెట్ డిపో మేనేజర్లను, విజిలెన్స్ డీఎస్పీ మహంకాళి గారిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా బహుజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకత్వాన్ని పరిచయం చేసి, ఆర్టీసీ అభివృద్ధి, కార్మిక సంక్షేమం, యాజమాన్యం--ఉద్యోగుల మధ్య పరస్పర సహకారం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. బహుజన వర్కర్స్ యూనియన్ కార్మికుల హక్కుల పరిరక్షణతో పాటు ఆర్టీసీ సంస్థ అభివృద్ధికి కూడా సమాన ప్రాధాన్యత ఇస్తుందని నాయకులు పేర్కొన్నారు. కార్మికుల సంక్షేమం కోసం అవసరమైన ప్రతి అంశంపై ప్రభుత్వంతో, యాజమాన్యంతో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు దేవళ్ల సమ్మయ్య, టీఆర్పీ మహిళా అధ్యక్షురాలు పటేల్ వనజక్క, కార్మిక విభాగం అధ్యక్షులు సంకూరి శ్రీనివాస్, సహాయ కార్యదర్శి గిరిగాని భిక్షపతి, బహుజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ సంపత్ ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షులు సాజిద్ మహమ్మద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుద్దాల సురేష్, రాష్ట్ర అదనపు కార్యదర్శి గౌడ రవికిరణ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, రాష్ట్ర సలహాదారులు శ్రీనివాస్, వివిధ రాష్ట్ర నాయకులు, ఆర్టీసీ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆచార్య జయశంకర్ సేవలకు ఘన నివాళి

ఆగస్టు 6 హంస కాలంవార్త

జగద్గిరిగుట్టలో విశ్వకర్మ స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో పూలమాలలతో ఘనంగా నివాళులర్పణ తెలంగాణ సిద్ధాంతకర్త, మహనీయులు ఆచార్య ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ గారి జయంతి సందర్భంగా జగద్గిరిగుట్టలోని అవుట్‌పోస్ట్ సమీపంలో ఉన్న ఆయన విగ్రహానికి విశ్వకర్మ స్వర్ణకా ర సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు జయశంకర్ గారి విగ్రహానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. అనంతరం "జై తెలంగాణ" నినాదాల తో ఆ ప్రాంతం మార్మోగింది. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాంతం పోరాడిన ఆచార్య జయశంకర్ త్యాగాలు, సేవలను సభ్యులు స్మరించుకున్నారు. సంఘం నాయకులు మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమానికి సిద్ధాంత బలం చేకూర్చిన మహనీయుడు ఆచార్య జయశంకర్ అని కొనియాడారు. ఆయన చూపిన మార్గం, తెలంగాణ పట్ల ఉన్న అంకితభావం భావితరాలకు స్ఫూర్తి దాయ కమని పేర్కొన్నారు. సమాజంలో విద్య, సామాజిక చైతన్యం, స్వాభి మానాన్ని పెంపొందించేందుకు ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో జగద్గిరిగుట్ట విశ్వకర్మ స్వర్ణకార సంఘం అధ్యక్షులు ప్రభు చారి, ఉపాధ్యక్షులు విజయ్ కుమార్ చారి, కార్యదర్శి శ్రీనివాస్ చారి, కోశాధికారి లక్కోజు శివ చారి, ప్రధాన కార్యదర్శి సత్తిబాబు, ప్రధాన సలహాదారు సాయికుమార్ చారి, కార్యవర్గ సభ్యులు చందు చారి, రాఘవేంద్ర చారి, శివకుమార్ చారి, శశికాంత్ చారి, రాంబాబు చారి తదితరులు పాల్గొని ఆచార్య జయశంకర్ కి ఘనంగా నివాళులర్పించారు.



## తెలంగాణ సాధనలో జయశంకర్ పాత్ర మరువలేనిది

-తెలంగాణ కోసం జీవితాన్నే అంకితం చేసిన మహనీయుడు
-జనగామలో జయశంకర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తాం
-విగ్రహ నిర్మాణానికి అయ్యే పూర్తి ఖర్చును నేనే భరిస్తా
-జయశంకర్ జయంతి వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యేం డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి



(ఆగస్టు 6 హంస కలంవార్త )

తెలంగాణ సిద్ధాంతకర్త, ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా జనగామ పట్టణ కేంద్రంలోని 11వ వార్డులో గురువారం ఏర్పా టు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జయ శంకర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పిం చారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో జయశంకర్ గారి సేవల ను స్మరించుకుంటూ ప్రసంగించారు. తెలంగాణ ఉద్యమానికి తొలి బీజాలు వేసి, ప్రత్యేక రాష్ట్ర సాధనకు బలమైన సిద్ధాంతాన్ని అందించిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ అని కొనియాడారు. తెలంగాణ ఎందుకు ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడాలనే అంశాన్ని చారిత్ర క, ఆర్థిక, సామాజిక, రాజకీయ కోణాల్లో శాస్త్రీయంగా విశ్లేషించి ప్రజల కు అర్థమయ్యేలా వివరించిన గొప్ప మేధావి అని అన్నారు. తన రచనలు, ప్రసంగాలు, సదస్సులు, ఉపన్యాసాల ద్వారా లక్షలా ది మంది యువతలో తెలంగాణ చైతన్యాన్ని నింపారని తెలిపారు. 1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమం నుంచి చివరి వరకు విద్యా ర్థులు, ఉద్యోగులు, మేధావులు, ప్రజలకు అండగా నిలిచి ఉద్యమానికి నిరంతరం మార్గనిర్దేశం చేశారని గుర్తు చేశారు. తెలంగాణ సమాజంలో ఆత్మగౌరవ భావనను పెంపొందించడంలో ఆయన పాత్ర అపూర్వమని పేర్కొన్నారు. 2001లో కేసీఆర్ ప్రారంభించిన మలిదశ తెలంగాణ ఉద్యమానికి జయశంకర్ గారు సైద్ధాంతిక బలాన్ని అందించారని, ఉద్యమ దిశాని ర్దేశంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. తెలంగాణ ఉద్యమం విజయవంతం కావడంలో జయశంకర్ గారి ఆలోచనలు, సిద్ధాంతాలు, మార్గదర్శకత్వం ఎంతో కీలకమని ఎమ్మెల్యే అన్నారు. తెలంగాణ భాష, యాస, సంస్కృతిపై జయశంకర్ గారికి అపార మైన పట్టు ఉందని, వివిధ ప్రాంతాల పదజాలంపై ఆయన చేసిన అధ్య యనం ఆదర్శనీయమని ఎమ్మెల్యే గుర్తు చేశారు. ఈ సందర్భంగా జనగామ పట్టణంలో ప్రొఫెసర్ జయశంకర్ గారి విగ్రహాన్ని మరింత విశిష్టంగా ఏర్పాటు చేసేందుకు అవసరమైన స్థలా న్ని అధికారులు గుర్తిస్తే, విగ్రహ నిర్మాణం మరియు ప్రతిష్ఠాపనకు అయ్యే పూర్తి ఖర్చును వ్యక్తిగతంగా తానే భరిస్తానని ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి గారు హామీ ఇచ్చారు. అనంతరం తెలంగాణ సాధనలో ప్రొఫెసర్ జయశంకర్ గారి పాత్ర, ఆయన ఆశయాలు, సిద్ధాంతాలు భావితరాలకు శాశ్వత స్ఫూర్తిగా నిలుస్తాయి. ఆయన చూపిన మార్గంలో నడవడమే ఆయనకు అందిం చే గొప్ప నివాళి అని ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మరమ్మత్తులకు గురైన పైప్ లైన్

-20 రోజులుగా తాగునీరు బంద్
-సిసి రోడ్డుకు సైడ్ బర్మ్ పోస్తున్న తరుణంలో పైప్ డ్యామేజ్

(ఆగస్టు 6 హంస కలంవార్త )



ఓ కాంట్రాక్టర్ నిర్లక్ష్య పనులకు సుమారు 70 నివాసాల వారు, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు తాగునీరుకి ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయం నుండి ప్రభుత్వ జూనియర్ కళాశాల మీదుగా అంబేద్కర్ నగర్ గ్రామానికి భార జల కర్మాగారం వారు సుమారు రూ. 5 లక్షల వ్యాయంతో తాగునీటి సౌకర్యం కల్పించేందుకు పైప్లైన్ ఏర్పాటు చేశారు. అయితే కళాశాలకు వెళ్లే దారికి సిసి రోడ్ల నిర్మాణం చేపట్టిన ఓ కాంట్రాక్టర్ రోడ్డు సైడ్ బర్మ్‌కు ఇతర ప్రాంతాల నుంచి నాణ్యమైన గ్రావెల్ను తీసుకొచ్చి పోయాల్సి ఉన్నప్పటికీ సిసి రోడ్డుకు తహసిల్దార్ కార్యాలయానికి మధ్యన ఉన్న రెండు మీటర్ల వెడల్పు భాగంలోనే జెసిబి యంత్రంతో భారీ కందకాన్ని పెట్టి మట్టి పోశాడు. సైడ్ బర్మ్‌కు కందకం తీస్తున్న తరుణంలో తహసిల్దార్ కార్యాలయానికి వెళు తున్న పైప్ లైన్ మరమ్మత్తులకు గురైంది. అయినప్పటికీ సదరు కాంట్రాక్టర్ పైప్లైన్ ను పట్టించుకోకుండా నిర్లక్ష్య ధోరణితో తన పనిని నామమాత్రంగా ముగించుకొని వెళ్ళిపోయాడు. దీంతో అంబేద్కర్ నగర్ గ్రామ ప్రజలతోపాటు పక్కనే ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలకు నెల రోజుల నుండి తాగునీటి సమస్య తీవ్రతరమైంది. సీసీ రోడ్డుకు సైడ్ బర్మ్ కోసం తీసిన కందకం సుమారు మీటర్ లోతు, వెడల్పు ఉండడంతో పెద్ద ఎత్తున వర్షపు నీరు నిలిచాయి. పైపులైనుకు మరమ్మత్తులు చేసేందుకు పెద్ద మొత్తంలో నీరు నిల్వ ఉండడంతో గౌతమీ నగర్ కాలనీ నుండి వస్తున్న తాగునీరు పైప్ లైన్ లీకేజీ అవడంతో అధికారులు నీటి సరఫరాను నిలిపివేశారు. దీంతో గ్రామస్తులతో పాటు కళాశాల విద్యార్థులు తాగునీటికి తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. ఓ పక్కన విద్యార్థులు స్థానికులు తాగునీటికి అవస్థలు పడుతున్నప్పటికీ స్థానిక పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధం శాఖల అధికారులు మరమ్మత్తులు చేసి తాగునీటిని పునరుద్ధరించాలని విద్యార్థులు, అంబేద్కర్ నగర్ వాసులు కోరుతున్నారు.

# గోల్డ్ మాన్ కొండా విజయ్‌కుమార్ కార్యాలయంలో రిపోర్టర్ వి. విష్ణు పుట్టినరోజు వేడుకలు ఘనంగా















**ఆగష్టు 6 హంస కాలంవార్త**

పుట్టినరోజును సేవా దినోత్సవంగా మార్చిన లయన్స్ క్లబ్ సభ్యులు -- స్పైనల్ కార్డ్ సమస్యతో బాధపడుతున్న చిన్నారి కుటుంబానికి ఆర్థిక సాయం స్నేహానికి విలువ, సేవకు ప్రాధాన్యం, సమాజం పట్ల బాధ్యతను చాటిచెప్పే విధంగా రిపోర్టర్ వి. విష్ణు పుట్టినరోజు వేడుకలు ఆయన చిన్ననాటి స్నేహితుడు, ప్రముఖ సామాజిక సేవకుడు, గోల్డ్ మాన్ కొండా విజయ్‌కుమార్ కార్యాలయంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఆనందోత్సాహాల మధ్య జరిగిన ఈ వేడుకలు కేవలం జన్మదిన వేడుకలకే పరిమితం కాకుండా, ఒక నిరుపేద కుటుంబానికి అండగా నిలుస్తూ సేవా కార్యక్రమంగా మారడం విశేషం. పుట్టినరోజు వేడుకలకు గోల్డ్ మాన్ కొండా విజయ్‌కుమార్, లయన్స్ క్లబ్ సభ్యులు, హోప్ ఫౌండేషన్ సభ్యులు, స్నేహితులు, సామాజిక కార్యకర్తలు, మీడియా ప్రతినిధులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో హాజరై విష్ణుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కొండా విజయ్‌కుమార్ స్వయంగా విష్ణుతో కలిసి కేక్ కట్ చేయించి, శాలువాతో సన్మానించి, జ్ఞాపిక అందజేసి ఆశీర్వదించారు. చిన్ననాటి స్నేహం... నేటికీ చిరస్థాయిగా కొండా విజయ్‌కుమార్, వి. విష్ణు చిన్ననాటి నుంచి మంచి స్నేహితులు. కాలం మారినా, వృత్తులు మారినా వారి స్నేహబంధం మాత్రం అలాగే కొనసాగుతోందని కార్యక్రమానికి హాజరైన వారు పేర్కొన్నారు. తమ చిన్ననాటి స్నేహితుడి పుట్టినరోజును తన కార్యాలయంలో కుటుంబ సభ్యుడిలా జరపడం పట్ల కొండా విజయ్ కుమార్‌ను పలువురు అభినందించారు. సేవే నిజమైన పుట్టినరోజు వేడుక పుట్టినరోజు సందర్భంగా కేవలం కేక్ కట్ చేయడం కాకుండా సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించారు. లయన్స్ క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో స్పైనల్ కార్డ్ సమస్యతో బాధపడుతున్న చిన్నారి కుటుంబానికి నగదు ఆర్థిక సహాయం అందజేశారు. చిన్నారి చికిత్సకు ఈ సహాయం కొంతైనా ఉపయోగ పడాలని ఆకాంక్షిస్తూ కుటుంబ సభ్యులకు నగదు అందించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ సభ్యులు మాట్లాడుతూ, పుట్టినరోజులు, వివాహ వార్షికోత్సవాలు వంటి శుభ సందర్భాల్లో పేదలకు చేయూతనివ్వడం గొప్ప సంస్కృతి అని పేర్కొన్నారు. సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయం అందించాలని పిలుపునిచ్చారు. హోప్ ఫౌండేషన్, లయన్స్ క్లబ్‌తో సేవా బాటలో విష్ణు రిపోర్టర్ వి. విష్ణు కేవలం జర్నలిస్టుగానే కాకుండా సామాజిక సేవలోనూ చురుకైన పాత్ర పోషిస్తున్నారు. గోల్డ్ మాన్ కొండా విజయ్‌కుమార్ స్థాపించిన హోప్ ఫౌండేషన్ సభ్యుడిగా అనేక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. అలాగే లయన్స్ క్లబ్ సభ్యుడిగా రక్తదాన శిబిరాలు, అన్నదాన కార్యక్రమాలు, వైద్య శిబిరాలు, విద్యార్థులకు సహాయం, పేదలకు నిత్యావసర వస్తువుల పంపిణీ వంటి కార్యక్రమాల్లో నిరంతరం సేవలందిస్తున్నారు. గోల్డ్ మాన్ కొండా విజయ్‌కుమార్ సేవలు ప్రశంసనీయం గోల్డ్ మాన్ కొండా విజయ్‌కుమార్ అనేక సంవత్సరాలుగా సామాజిక సేవలో విశేష కృషి చేస్తున్నారు. హోప్ ఫౌండేషన్ ద్వారా వేలాది మంది నిరుపేదలకు అన్నదానం, వైద్య సహాయం, విద్యార్థులకు విద్యా ప్రోత్సాహం, పేద కుటుంబాలకు ఆర్థిక సహాయం, అత్యవసర సమయంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల అభిమానాన్ని సంపాదించారు. ఆయన చేపడుతున్న సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని పలువురు కొనియాడారు. లయన్స్ క్లబ్ సభ్యుల అభినందనలు ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ సభ్యులు మాట్లాడుతూ, విష్ణు పుట్టినరోజును సేవా కార్యక్రమంతో నిర్వహించడం చాలా ఆనందంగా ఉందన్నారు. సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా నిజమైన పుట్టినరోజు వేడుకలకు అర్థం వస్తుందని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా చేపట్టాలని ఆకాంక్షించారు. కేక్ కటింగ్, సన్మానం వేడుకల్లో విష్ణు కేక్ కట్ చేయగా, గోల్డ్ మాన్ కొండా విజయ్‌కుమార్, లయన్స్ క్లబ్ సభ్యులు, హోప్ ఫౌండేషన్ సభ్యులు కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విష్ణును శాలువాతో ఘనంగా సన్మానించి, జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా స్నేహితులు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. పాల్గొన్న ప్రముఖులు ఈ కార్యక్రమంలో గోల్డ్ మాన్ కొండా విజయ్‌కుమార్, లయన్స్ క్లబ్ సభ్యులు శాంతిభూషణ్ రెడ్డి, మారం వెంకట్, మారం ప్రసాద్, రాజశేఖర్, బర్క మల్లేష్, రవీందర్, మధుసూదన్ రెడ్డి, శంకర్, షర్ఫుద్దీన్, దత్తు తదితరులు పాల్గొన్నారు. అలాగే హోప్ ఫౌండేషన్ సభ్యులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు హాజరై విష్ణుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. సేవా సందేశంతో ముగిసిన వేడుకలు ఆనందం పంచుకోవడం కంటే గొప్పది అవసరంలో ఉన్న వారికి అండగా నిలవడమేనని ఈ కార్యక్రమం మరోసారి చాటిచెప్పింది. పుట్టినరోజును సేవా కార్య్ర మంగా నిర్వహించడం ద్వారా రిపోర్టర్ వి. విష్ణు, గోల్డ్ మాన్ కొండా విజయ్ కుమార్, లయన్స్ క్లబ్ సభ్యులు సమాజానికి ఆదర్శ్రపాయమైన సందేశాన్ని అందించారు. ఇటువంటి కార్యక్రమాలు మరెందరికో స్ఫూర్తినిచ్చి, సేవా భావాన్ని పెంపొందించాలని కార్యక్రమానికి హాజరైనవారు ఆకాంక్షించారు.

# బాలానగర్ వినాయక్ నగర్ కాలనీలో ఘనంగా రిపోర్టర్ వి. విష్ణు పుట్టినరోజు వేడుకలు





**(ఆగష్టు 6 హంస కాలంవార్త)**





రిపోర్టర్ వి. విష్ణు పుట్టినరోజు వేడుకలు కూకట్‌పల్లి నియోజకవర్గంలోని వినాయక్ నగర్ కాలనీలో కాలనీ అధ్యక్షుడు, సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.దఈ సందర్భంగా కాలనీ సభ్యులు విష్ణుతో కలిసి కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. శాలువాతో సన్మానించి, ఆయన ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని ఆకాంక్షించారు. రిపోర్టర్‌గా ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ, సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న విష్ణు సేవలను కాలనీ సభ్యులు అభినందించారు. సమాజానికి మరింత సేవ చేయాలని, ప్రజల గొంతుకగా కొనసాగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్ధిరాములు శ్రీధర్ అన్న, శంకర్ అన్న, రిషి, సందీప్, సాయి రాజేష్తో పాటు వినాయక్ నగర్ కాలనీ అధ్యక్షుడు, కమిటీ సభ్యులు, పాల్గొని పుట్టినరోజు వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు.

# స్పోర్ట్స్

## గిల్‌కు రెండుసార్లు గాయం.. తొలి టెస్టుకు ముందు భారత శిబిరంలో టెన్షన్



శ్రీలంకతో మూడు రోజుల వార్మప్ మ్యాచ్‌కు ముందు భారత టెస్టు జట్టుకు స్వల్ప ఆందోళన ఎదురైంది. కొలంబోలో గురువారం జరిగిన ప్రాక్టీస్‌లో కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కుడి చేతికి రెండుసార్లు గాయమైంది. అయితే ప్రాథమిక పరీక్షల్లో అది అంత తీవ్రమైనదేమీ కాదని తేలడంతో జట్టు ఊపిరి పీల్చుకుంది. మొదట నెట్ ప్రాక్టీస్‌లో ఫాస్ట్ బౌలర్ గుర్నూర్ బ్రార్ బంతి గిల్ కుడి బొటనవేలికి బలంగా తాకింది. వెంటనే వైద్య సిబ్బంది వచ్చి చికిత్స అందించారు. బొటనవేలికి బ్యాండేజ్ వేసిన తర్వాత గిల్ మళ్లీ బ్యాటింగ్‌కు దిగారు. ఆ తర్వాత స్పిన్ బౌలర్లను కూడా ఎదుర్కొంటూ సాధన కొనసాగించారు. అక్కడితో ఇబ్బంది ముగియలేదు. తర్వాత స్లిప్ క్యాచింగ్ ప్రాక్టీస్‌లో మరోసారి కుడి చేతికి బంతి బలంగా తాకింది. దీంతో కొద్దిసేపు సాధన ఆపి ఐస్ ప్యాక్ పెట్టుకున్నారు. అనంతరం మళ్లీ ప్రాక్టీస్ పూర్తి చేశారు. ఎలాంటి ఫ్రాక్చర్ లేదని వైద్య బృందం స్పష్టం చేసినట్లు సమాచారం. ఆగస్టు 15 నుంచి గాలే వేదికగా తొలి టెస్టు ప్రారంభం కానున్న వేళ ఈ ఘటన భారత జట్టులో కాస్త ఆందోళన కలిగించింది. ఇప్పటికే గాయాల కారణంగా సిరీస్‌కు బుమ్రా దూరమయ్యాడు. వాషింగ్టన్ సుందర్, హర్షిత్ రాణా కూడా అందుబాటులో లేరు. సాయి సుదర్శన్ కాలివేలు గాయం నుంచి కోలుకుంటూ బెంగళూరులోనే ఉన్నాడు. ఈ పరిస్థితుల్లో గిల్ పూర్తిస్థాయి లో ఫిట్‌గా ఉండటం జట్టుకు ఎంతో కీలకం.వార్మప్ మ్యాచ్‌లో గిల్ బరిలోకి దిగే అవకాశమే ఉన్నా.. ఫీల్డింగ్ సమయంలో అతనిపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకునే అవకాశం కనిపిస్తోంది. ఇటీవల టెస్టుల్లో అద్భుత ఫామ్‌లో ఉన్న గిల్.. గత 10 మ్యాచుల్లో 1,109 పరుగులు చేసి ఆరు సెంచరీలు నమోదు చేశారు. శ్రీలంక పిచ్‌లకు అలవాటు పడేందుకు ఈ వార్మప్ మ్యాచ్ అతనికి కీలకంగా మారనుంది.

# బిజినెస్

## ఫోన్‌పేలో కొత్త సర్వీస్.. ఫిక్స్‌డ్ డిపాజిట్, ఆర్‌డీ సేవలు ప్రారంభం




ఫోన్‌పే తన వినియోగదారులకు మరో కొత్త ఆర్థిక సేవను అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రముఖ బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల భాగస్వామ్యంతో ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ) సేవలను ప్రారంభించింది. అదే సమయంలో 'శివాలిక్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్'తో కలిసి రోజుకు రూ.100 నుంచే పొదుపు చేసే డైలీ రికరింగ్ డిపాజిట్ (డైలీ ఆర్‌డీ) సదుపాయాన్ని కూడా అందుబాటులోకి తెచ్చింది.ఫోన్‌పే యాప్‌లోనే వివిధ బ్యాంకుల ఎఫ్‌డీలను పరిశీలించి, పోల్చి, వెంటనే బుక్ చేసుకునే అవకాశం కల్పించింది. భాగస్వామ్య బ్యాంకుల్లో చేసిన ఎఫ్‌డీలకు ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం 'డిపాజిట్ ఇన్సూరెన్స్ అండ్ క్రెడిట్ గ్యారంటీ కార్పొరేషన్' (డీఐసీజీసీ) నుంచి రూ.5 లక్షల వరకు బీమా రక్షణ ఉంటుంది.కొత్తగా తీసుకొచ్చిన డైలీ ఆర్‌డీ ద్వారా రోజుకు రూ.100 నుంచి రూ.1,000 వరకు ఆటోమేటిక్‌గా పొదుపు చేయొచ్చు. యూపీఐ ఆటోపే ద్వారా ప్రతి రోజు నిర్ణయించిన మొత్తం జమ అవుతుంది. ఏడు రోజుల తర్వాత అవసరమైతే డబ్బు ఉపసంహరించుకోవచ్చు. వరుసగా 15 రోజుల పాటు చెల్లింపులు జరగకపోయినా ఎలాంటి జరిమానా ఉండదని ఫోన్‌పే తెలిపింది. అవసరమైతే ఎప్పుడైనా ఆటోపేను నిలిపివేసే అవకాశం కూడా ఉంది.ఫోన్‌పే హోమ్ స్క్రీన్‌లోని మ్యూచువల్ ఫండ్స్ అండ్ డిపాజిట్ విభాగంలోకి వెళ్లి ఎఫ్‌డీ లేదా డైలీ ఆర్‌డీని ఎంపిక చేసుకోవచ్చు. అనంతరం బ్యాంకు, కాలపరిమితి, పెట్టుబడి మొత్తాన్ని ఎంచుకుని పాన్, ఆధార్‌తో డిజిటల్ ధ్రువీకరణ పూర్తి చేయాలి. తర్వాత యూపీఐ లేదా నెట్‌బ్యాంకింగ్ ద్వారా చెల్లింపు చేసి డిపాజిట్‌ను ప్రారంభించవచ్చు.

# 'కొరియన్ కనకరాజు'లో వరుణ్ కొత్త రూపం

## ఇప్పటివరకు చూడని పాత్ర అంటున్న హీరో







వరుణ్ తేజ్ కథానాయకుడిగా మేర్లపాక గాంధీ తెరకెక్కించిన హారర్ కామెడీ 'కొరియన్ కనకరాజు' ఆగస్టు 7న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా సినిమా గురించి వరుణ్ తేజ్ ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. కడుపుబ్బా నవ్వించే పూర్తి వినోదాత్మక చిత్రంగా ఈ సినిమా ప్రేక్షకులను అలరిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశాడు. మంచి వినోదాత్మక సినిమా చేయాలన్న ఆలోచన చాలా రోజులుగా ఉందని వరుణ్ చెప్పాడు. కొవిడ్ తర్వాత ఎక్కువగా సీరియస్, యాక్షన్ కథలే వచ్చాయని, అలాంటి సమయంలో మేర్లపాక గాంధీ చెప్పిన ఈ కథ తనకు బాగా నచ్చిందన్నాడు. కథ విన్నప్పుడల్లా తాను కూడా ప్రేక్షకుడిలాగే ఆలోచిస్తానని చెప్పాడు. హీరోలు అన్ని రకాల పాత్రలు చేయాలని తాను నమ్ముతానని వరుణ్ తెలిపాడు. పొడవుగా ఉండే హీరోలకు కామెడీ సరిపోదనే అభిప్రాయం సరికాదన్నాడు. పాత్రను బాగా రాస్తే కామెడీ సహజంగానే పండుతుందని చెప్పాడు. ఈ సినిమాలో నవ్వులతో పాటు యాక్షన్ కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని వెల్లడించాడు. సినిమా ప్రచార కార్యక్రమాలు కూడా కొత్తగా ఉండాలని భావించామని వరుణ్ చెప్పాడు. అందుకే సినిమా స్వభావానికి తగ్గట్టే ప్రమోషన్స్ నిర్వహిం చినట్లు తెలిపాడు. నటుడు సత్యతో తనది మంచి అనుబంధమని, ఇద్దరి మధ్య వచ్చే సన్నివేశాలు ప్రేక్షకులను బాగా నవ్విస్తాయని అన్నాడు. సత్యలో గొప్ప నటుడు కూడా ఉన్నాడని ప్రశంసించాడు. కథానాయిక రితికా నాయక్ ఈ సినిమా కోసం ఎంతో కష్టపడిందని చెప్పాడు. ఈ సినిమా కో సం కొరియన్ భాష కూడా నేర్చుకున్నట్లు వరుణ్ వెల్లడించాడు. కొత్త విషయాలు నేర్చుకోవడం తనకు ఎప్పుడూ ఇష్టమేనని చెప్పాడు. ఒకే సినిమాలో రెండు భిన్నమైన బాడీ లాంగ్వేజ్‌లు, రెండు రకాల మనస్త త్వాలు చూపి ంచే అవకాశం రావడం నటుడిగా ఎంతో సంతృప్తిని చ్చిందన్నాడు. కొంతమంది ఈ సినిమాను 'ఓజీ'తో పోలుస్తున్నారని వస్తున్న చర్చలపై కూడా వరుణ్ స్పందిం చాడు. తమ సినిమాకు 'ఓజీ'తో ఎలా ంటి సంబంధం లేదని స్పష్టం చేశాడు. అలాగే ఈ సిని మాలో తనను ఇప్పటివరకు కనిపించని కొత్త శైలిలో దర్శకుడు చూపి ంచారని చెప్పాడు. నిర్మాతలు ఎక్కడా రాజీ పడకుండా సినిమా నిర్మించారని, తమన్ అంది ంచిన సంగీతం సినిమాకుమరోప్రధాన బలంగా నిలుస్తుందని అన్నాడు.

Edited, Printed,Published and Owned by Vadla Madhusudhan chary, H. NO. 42-397 Anjaiah- Nagar, Behind Hanuman temple, ALLWYN COLONY Medchal Malkajgiri, Telangana 500037, Printed at NALIVELLI EXPRESS, PUBLISHED FROM HNo1-1A9T-10,Main road, pattikonda kurnool, Andhrapradesh 518380, Cell.No.9966555449